మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక


www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 30-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 301 Issue: 301

30 ఏప్రిల్ 2026 - గురువారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు వైశాఖ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:54 సూర్యాస్తమయం - సా. 6:32 తిథి చతుర్దశి రా. 9:15 వరకు తరువాత పౌర్ణమి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం చిత్తా రా. 2:12ం వరకు తరువాత స్వాతి యోగం వజ్ర రా. 8:51 వరకు కరణం గరజ ఉ. 8:30 వరకు వనిజ రా. 9:15 వరకు వర్జ్యం ఉ. 8:56 నుండి ఉ. 10:40 వరకు దుర్ముహూర్తం ఉ. 10:07 నుండి ఉ. 10:57 వరకు మ. 3:10 నుండి సా. 4:00 వరకు రాహుకాలం మ. 1:48 నుండి మ. 3:22 వరకు యమగండం తె. 5:54 నుండి ఉ. 7:29 వరకు గుళికకాలం ఉ. 9:04 నుండి ఉ. 10:38 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:18 నుండి తె. 5:06 వరకు అమృత ఘడియలు రా. 7:20 నుండి రా. 9:04 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

## ఎగ్జిట్ పోల్ ఎవరిది గెలుపు?

...సగటు అంచనా...

| పుదుచ్చేరి (సీట్లు: 30) | బెంగాల్ (సీట్లు: 294) | అసోం (సీట్లు: 126) | తమిళనాడు (సీట్లు: 234) | కేరళ (సీట్లు: 140) |
|---|---|---|---|---|
| ఎన్ఆర్సీ: 16 - 19 | టీఎంసీ: 177 - 187 | బీజేపీ: 88 - 101 | డీఎంకే: 125 - 145 | యూడీఎఫ్: 75 - 85 |
| కాంగ్రెస్: 10 - 12 | బీజేపీ: 95 - 110 | కాంగ్రెస్: 15 - 36 | ఏడీఎంకే: 65 - 80 | ఎల్డీఎఫ్: 55 - 65 |
| ఇతరులు: 1 - 2 | కాంగ్రెస్: 1 - 3 | ఏఐయూడీఎఫ్: 0 | టీవీకే (విజయ్): 18 - 24 | బీజేపీ: 0 - 3 |
| | వామపక్షాలు: 0 - 1 | ఇతరులు: 0 - 3 | ఇతరులు : 2 - 6 | ఇతరులు : 0 |




# టెన్త్‌తో 95.15% ఉత్తీర్ణత

ఫలితాల్లో బాలికలదే పైచేయి.. సబ్జెక్టుల వారీగా మార్కులు.. తొలిసారి వాట్సాప్‌లో రిజల్ట్స్

**జూన్ 5 ను సప్లిమెంటరీ.. ఫీజు చెల్లింపునకు మే 14 డెడ్‌లైన్**

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల ఫలితాలను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 95.15 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు అధికారులు ప్రకటించారు. ప్రభుత్వ సలహాదారు, సీనియర్ నేత కే కేశవరావు ఈ ఫలితాలను అధికారికంగా విడుదల చేశారు. ఎప్పటిలాగే ఈసారి కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): బాలికలు 96.26 శాతం ఉత్తీర్ణత సాధించగా, బాలురు 94.07 శాతంతో కాస్త వెనుకబడ్డారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 13 వరకు జరిగిన ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,28,239 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాల్లో ములుగు జిల్లా 99.30 శాతంతో రాష్ట్రంలోనే అత్యధిక ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, 89.23 శాతంతో హైదరాబాద్ జిల్లా అత్యల్ప ఉత్తీర్ణతతో తరువాయి 2 వ పేజీలో...

## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు విడుదల

ఉదయం 11 గంటలకు రిలీజ్.. వాట్సాప్, లీప్ యాప్‌లో ఫలితాలు

# 20% భూ విలువ పెంపు!

## మూడు విడతల్లో మిగతా పెంపు

మే 10 తర్వాత తుది నివేదిక.. ఆ తర్వాతే పెంపుపై స్పష్టత



**ఎల్ఆర్ఎస్ చార్జీల్లో 25% రాయితీ**

మే 1 నుంచి 31 వరకు డిస్కౌంట్ అమలు

భూముల మార్కెట్ విలువలను పెంచే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగవంతం చేస్తోంది. ప్రజలపై ఒకేసారి ఆర్థిక భారం పడకుండా ఉండాలని ఆర్థిక సలహాదారు అరవింద్ సుబ్రహ్మణ్యం ఇచ్చిన సూచనల మేరకు.. ఈ పెంపును దశలవారీగా అమలు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీని ప్రకారం.. తొలి విడతలో సగటున 20 శాతం మేర విలువల పెంపును అమలు చేసే అవకాశం ఉంది.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): ఆ తర్వాత మార్కెట్ పరిస్థితులను బట్టి రెండు, మూడు విడతల్లో మిగిలిన పెంపును చేపట్టాలని ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు పరిధిలో రియల్ ఎస్టేట్ రంగంపై ప్రతికూల ప్రభావం పడకుండా శాస్త్రీయంగా భూముల మార్కెట్ విలువలను సవరించాలని సర్కార్ భావిస్తోంది. తెలంగాణలో భూముల మార్కెట్ విలువలపై లోతైన అధ్యయనం చేసేందుకు అరవింద్ సుబ్రహ్మణ్యం బృందం రంగంలోకి దిగింది. ఇప్పటికే ముఖ్యమంత్రి తరువాయి 2 వ పేజీలో...

# భారతీయుల్లో శివుడి డీఎన్ఏ

**కులమతాలు వేరైనా అంతా ఒక్కటే**

జామియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మజహర్ ఆసిఫ్



జామియా మిలియా ఇస్లామియా (JMI) వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మజహర్ ఆసిఫ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. మంగళవారం ఢిల్లీలోని జామియా క్యాంపస్‌లో ఆరెస్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ కుంభ్' కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా భారతీయుల మూలాల గురించి చెప్పిన విషయాలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

ఢిల్లీ: భారతీయులందరి డీఎన్ఏ ఒక్కటేనని, అది 'మహాదేవుని డీఎన్ఏ' అని వ్యాఖ్యానించారు. అక్కడ ఉన్న విద్యార్థులను ఉద్దేశిస్తూ.. 'మీ అందరి మాతృభాషలు వేరు కావచ్చు, మీ సంప్రదాయాలు, సంస్కారాలు వేరుగా ఉండవచ్చు, కానీ మనమందరం భారతీయులం. ఎందుకంటే మన రక్తం, మన డీఎన్ఏలో పరమశివుని తాలూకు అంశ ఉంది' అని పేర్కొన్నారు. ప్రపంచంలోనే సనాతన సంస్కృతి అత్యుత్తమమైనదని, అది అందరి హితాన్ని కోరుకుంటుందని తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,044 |
| వెండి (గ్రాము): | రూ.265 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,902 |

# రిటైర్డ్ ఉద్యోగులకు 1000 కోట్లు

## విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం

వేల మంది కుటుంబాల్లో సంతోషం



తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి.. రిటైర్ అయిన వారికి ఇచ్చే డబ్బులు కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే. అయితే తమ బకాయిలను విడుదల చేయాలంటూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఇప్పటికే ఎన్నోసార్లు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసుకున్నారు. కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌లో తమ నిరసన కూడా వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పెండింగ్ బకాయిలను విడుదల చేస్తూ.. తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి పేరుకుపోయిన జీపీఎఫ్ బకాయిలను మొత్తం క్లియర్ చేసింది. ఈ క్రమంలోనే తెలంగాణ ఆర్థిక శాఖ ఇవాళ రూ.1,000 కోట్ల బకాయిలను విడుదల చేసింది.రాష్ట్రంలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రిటైర్డ్ ఉద్యోగుల జీపీఎఫ్ బకాయిలను తాజాగా ప్రభుత్వం క్లియర్ చేసింది. 2025 అక్టోబర్ వరకు ఉన్న అన్ని బకాయిలను ఒకేసారి రిలీజ్ చేసింది. ఈ నిర్ణయంతో పదవీ విరమణ చేసిన వేల మంది ఉద్యోగుల కుటుంబాల్లో ఆనందాలు వ్యక్తం అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందుల నేపథ్యంలో విడుదలకు మోక్షం లభించింది. దీంతో ఆ నిధులు ఇప్పుడు నేరుగా రిటైర్డ్ ఉద్యోగుల వారి అకౌంట్లలో జమ తరువాయి 2 వ పేజీలో...

# తుమ్మిడిహట్టి వేగం పెంచండి

## అధికారులకు సీఎం రేవంత్ ఆదేశాలు



తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణ కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.బుధవారం ఎంసీహెచ్ఆర్డీ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ ఇంజనీర్లు, నిపుణులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాజ్యసభ ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, ఈఎన్సీ శ్రీధర్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితర అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): తుమ్మిడి హెట్టి బరాజ్ ని ఎంత ఎత్తున నిర్మించాలి.. ఎంత ఎత్తు నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందని ఈ సందర్భంగా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ మీద ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం దాదాపు 11 వేల కోట్లు ఖర్చు చేసిందని, ఇప్పటికే కొన్ని చోట్ల కాల్వల నిర్మాణం కూడా జరిగింది. ఇప్పటికే 71.5 కిలోమీటర్ల కెనాల్ వర్క్ జరిగిందని అధికారులు సీఎం కు వివరించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని సూచించారు. ఇప్పటికే -2 వ పేజీలో...

## విశ్వవాణి



జపాన్‌లో మొబైల్ ఫోన్లు పోతే 83 శాతం తిరిగి చేతికి వస్తాయి. అక్కడి ప్రజలకు చిన్నప్పటి నుంచే నీతి, నిజాయతీ గురించి పాఠాలు చెప్తారు. దాంతో వారిలో సహజంగానే గొప్ప అలవాట్లు అబ్బుతాయి.

# కవిత మర్యాద కోల్పోయింది!




**ఉద్యమకారుడి కూతురిగా బాధ్యతతో మాట్లాడాల్సింది**

**తొలి సమావేశంలోనే తండ్రిని తిట్టడం బాధ కలిగింది**

**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

చౌటుప్పల్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): కల్వకుంట్ల కవిత కొత్తగా పెట్టిన తెలంగాణ రాష్ట్ర సేన పార్టీపై మునుగోడు ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నేత కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర కామెంట్స్ చేశారు. కేసీఆర్ లాంటి ఉద్యమ నాయకుడిని పట్టుకుని.. పార్టీ ఆవిర్భావ సభలోనే కవిత చేసిన విమర్శలు సరికావని రాజగోపాల్ రెడ్డి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కవిత నూతన పార్టీ ఏర్పాటుపై స్పందించిన కోమటిరెడ్డి.. ఆమెపై విమర్శలు గుప్పించారు. అసలు కవిత ఒక కొత్త పార్టీని పెట్టడమే హాస్యాస్పదం అంటూ మండిపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో నలుగురుకో ఆప్షన్ సభ్యులను ఎన్నిక చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.. తరువాయి 2 వ పేజీలో...



# బెంగళూరులో వర్ష బీభత్సం

**ఆసుపత్రి గోడ కూలి 8 మంది మృతి.. పిడుగులు, ఉరుములతో భారీ వర్షం**

బెంగళూరు: బెంగళూరులో బుధవారం భారీ వర్షం బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో కురిసిన ఈ వర్షం జనాలను వణికించింది. అకాల వర్షానికి 8 మంది ప్రాణాలు కోల్పోయారు. బెంగళూరులోని బౌరింగ్, లేడీ కర్జాన్ ఆసుపత్రి సమీపంలో ప్రహరీ గోడ కూలిన ఘటనలో ముగ్గురు చిన్నారుల సహా ఏడుగురు ఘటనాస్థలిలోనే తరువాయి 2 వ పేజీలో...



# భారత్‌కు యూఏఈ 'స్పెషల్' ట్రీట్మెంట్

**ప్రత్యేక మార్గంలో చమురు సరఫరా**

న్యూఢిల్లీ/దుబాయ్: చమురు కొరతతో ఇబ్బంది పడుతున్న ఇండియాకు యూఏఈ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రత్యేక మార్గంలో ఇండియాకు చమురు సరఫరా చేయాలని నిర్ణయించింది. చమురు ఉత్పత్తి దేశాల సమాఖ్య అయిన ఒపెక్ నుంచి బయటకు వచ్చిన యూఏఈ నిర్ణయం ఇండియాకు తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు
30.4.2026

మేషం: దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి వ్యాపారాలలో స్వల్ప లాభాలు అందుకుంటారు. ముఖ్యమైన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ కలిగిస్తాయి. మిత్రులు, కుటుంబసభ్యుల నుంచి ఋణ ఒత్తిడులు పెరుగుతాయి. ఉద్యోగమున నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

వృషభం: ఆకస్మిక ప్రయాణాలు ఉంటాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. ఇంటాబయట బాధ్యతలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఆదాయానికి మించి ఖర్చులు ఉంటాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. వ్యాపారాలలో భాగస్తుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. ఉద్యోగాలలో స్థానచలన సూచనలు ఉన్నవి.

మిధునం: ముఖ్యమైన వ్యవహారాలలో ఆప్తుల సలహాలు పొందుతారు. సమాజంలో పేరు కలిగిన వారితో పరిచయాలు పెరుగుతాయి. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. వాహన అనుకూలత కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. ఆర్థిక పురోగతి సాధిస్తారు.

కర్కాటకం: ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు పనిచేయదు. బంధుమిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది. దూర ప్రయాణాలలో వాహనం నడిపే విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన శారీరక శ్రమ పెరుగుతుంది.

సింహం: సన్నిహితుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. నూతన వాహన భూ లాభాలు కలుగుతాయి. పాత బాకీలు వసూలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆర్థిక పురోగతి కలుగుతుంది. ఉద్యోగాలు లాభసాటిగా సాగుతాయి.

కన్య: ఆరోగ్య విషయంలో అశ్రద్ధ చేయడం మంచిది కాదు. చేపట్టిన పనులలో శ్రమ తప్పదు. సమయానికి చేతిలో డబ్బు నిల్వ ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దూర ప్రయాణాలలో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు మందకొడిగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: వాహన కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. ఉద్యోగమున అధికారులతో చర్చల్లో కొంత పురోగతి సాధిస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. బంధు మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు వేగవంతం చేస్తారు.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఆప్తుల నుంచి అరుదైన ఆహ్వానాలు ఉంటాయి. అవసరానికి ధనసహాయం లభిస్తుంది. నూతన వాహన సౌఖ్యం ఉన్నది. వ్యాపారాలు విస్తరిస్తాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి.

ధనస్సు: గృహమున కొద్దిపాటి ఒత్తిడులు తప్పవు. దూర ప్రయాణాలు వాయిదా పడుతాయి. ఆరోగ్యం మందగిస్తుంది. నూతన ఋణాలు చేస్తారు. ఊహించని ప్రయాణాలు చేయవలసి వస్తుంది. వ్యాపారాలు, ఉద్యోగాలు కొంత నిరాశ కలిగిస్తాయి.

మకరం: విలువైన వస్తువుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలి. వ్యాపారాలు, ఉద్యోగాలు అంతగా అనుకూలించవు. ముఖ్యమైన వ్యవహారాలలో అవరోధాలు కలుగుతాయి. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవదర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు ఉంటాయి.

కుంభం: ఇంటా బయట ఆశ్చర్యం కలిగించే విషయాలు తెలుస్తాయి. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. కొత్త పనులు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా ఉంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో మరింత పురోగతి సాధిస్తారు.

మీనం: విలువైన వస్తు, వాహనాలు కొనుగోలు చేస్తారు. భూవివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. ఉద్యోగాలలో పరిస్థితులు అనుకూలిస్తాయి.



# తుమ్మిడిహట్టి వేగం పెంచండి

మొదటి పేజీ తరువాయి

చేపట్టిన నిర్మాణాలన్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బరాజ్ నిర్మించాలని నిపుణులు సూచించారు. గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని.. 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చు తో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు. ఈ బజార్ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్ తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతులకు సాగు తాగు నీరు అందుతుందని, తక్కువ ఖర్చుతో గ్రావిటీ పై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్ కు నీటిని తెచ్చుకునే వీలుంటుందని సీఎం చెప్పారు. ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్ర తో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్ర లో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి వెంటనే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి సీఎం సూచించారు. సమీక్ష సమావేశం ముగిసిన వెంటనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాయాలని నిర్ణయం తీసుకున్నారు. గురువారం కేంద్ర మంత్రి అపాయింట్మెంట్ తీసుకొని నేరుగా కలిసి చర్చించే బాధ్యతను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి అప్పగించారు. తుమ్మిడిహెట్టి బరాజ్ అవసరం దృష్ట్యా మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని మంత్రి కిషన్ రెడ్డికి తెలంగాణ రైతుల తరపున విజ్ఞప్తి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. మేడిగడ్డ బరాజ్ పునరుద్ధరణ చర్యల్లో భాగంగా చేపడుతున్న జియో టెస్టింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. వానలు పడేలోపు పనులు పూర్తి చేయాలని మరోసారి స్పష్టం చేశారు.

## బెంగళూరులో వర్ష బీభత్సం

మొదటి పేజీ తరువాయి

మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. ఘటన గురించి సమాచారం తెలియగానే కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అక్కడకు చేరుకున్నారు. బౌరింగ్ ఆసుపత్రి ప్రాంగణం సమీపంలో జరిగిన గోడ కూలిన ఘోరమైన ఘటనలో ఏడుగురు మరణించినట్లు సీఎంఓ ధ్రువీకరించింది.బాధిత కుటుంబాలకు సీఎం సిద్ధూ ఆర్థిక సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ప్రభుత్వం తరపున అందజేయనున్నట్టు సీఎం తెలిపారు. భారీ వర్షాలు, బలమైన గాలులు, వడగళ్ల వాన ఆ ప్రాంతాన్ని ముంచెత్తింది. ఆ సమయంలో ఏడుగురు బాధితులు గోడ దగ్గర తలదాచుకుంటుండగా అది అకస్మాత్తుగా కూలిపోయింది. పోలీసులు, అత్యవసర సేవల సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో శిథిలాల నుంచి మృతదేహాలను గాయపడిన వారిని బయటకు తీశారు. ఈ ఘటన గురించి సమాచారం అందిన వెంటనే తాను సంఘటనా స్థలానికి బయలుదేరినట్లు డిప్యూటీ ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. “పోలీస్ కమిషనర్‌తో మాట్లాడాను.. వెంటనే సంఘటనా స్థలానికి వెళుతున్నాను. బాధితులకు వీలైనంత వరకూ సాయం చేస్తాం” అని ఆయన విలేకరులతో అన్నారు. బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసి, జనజీవనం అస్తవ్యస్తమైంది. అత్యధికంగా కాటన్‌పేట్‌లో 77.5 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. తర్వాత చామరాజ్‌పేట్ 77.0 మి.మీ., పులకేశినగర్ 62.0 మి.మీ., విశ్వేశ్వరపురం 60.5 మి.మీ.లలో వర్షపాతం కురిసింది. నేరిగ (55.0 మి.మీ.), రాజమహల్ గుట్టహళ్లి (54.0 మి.మీ.), బీటీఎం లేఅవుట్ (47.0 మి.మీ.) సహా పలు ఇతర ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురిశాయి. దీంతో పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రద్దీ సమయాల్లో ప్రయాణికుల కష్టాలు మరింత పెరిగాయి.

## రిటైర్డ్ ఉద్యోగులకు 1000 కోట్లు

మొదటి పేజీ తరువాయి

కానున్నాయి. మరోవైపు.. ఇప్పటివరకు పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయడంతో పాటు.. భవిష్యత్తులో కూడా జీపీఎఫ్ నిధుల చెల్లింపులను మరింత వేగంగా రిలీజ్ చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే ప్రతీ నెలా చేసే చెల్లింపుల పరిమితిని మరో రూ.వెయ్యి కోట్లకు పెంచుతూ రాష్ట్ర ఆర్థిక శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వల్ల ఉద్యోగులకు సంబంధించిన క్లెయిమ్‌లు, బిల్లులు ఇక నుంచి బకాయిల రూపంలో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు క్లియర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దుకుంటూనే.. సీఎం రేవంత్ రెడ్డి.. ఉద్యోగుల సంక్షేమం పట్ల కూడా దృష్టి పెట్టడంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పెండింగ్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయడంతో ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహం వచ్చిందని పేర్కొన్నారు. ఇక.. రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలకు సంబంధించి జరుగుతున్న జాప్యంపై ఇటీవలె తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే 100 రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇవ్వాల్సిన రూ.6,200 కోట్ల బకాయిలను చెల్లించాలని రాష్ట్ర మంత్రివర్గం ఇటీవలే నిర్ణయించింది. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులకు చెల్లించే జీతాల్లో 50 శాతం కోత విధించాలని నిర్ణయం తీసుకుంది.

## ఎల్ఆర్ఎస్ చార్జీల్లో 25 శాతం రాయితీ

**మే 1 నుంచి 31 వరకు డిస్కౌంట్ అమలు**

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): తెలంగాణ రాష్ట్రంలో రాయితీతో కూడిన ఎల్ఆర్ఎస్‌ల రిజిస్ట్రేషన్లకు గడువు మరో మూడు నెలలు ప్రభుత్వం పొడిగించింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేయించుకునే వాళ్లు ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు దాదాపు ఆరు లక్షల ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది జూన్ నాటికి గడువు ముగియగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల ద్వారా దాదాపు రెండున్నర వేల కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2020–భూముల క్రమబద్ధీకరణ–లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రాయితీ గడువు పొడిగించింది. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలలపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో కార్పొరేషన్ల పరిధిలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలో 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షలు లెక్కన దరఖాస్తులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు మినహా ఇతర లే–అవుట్ లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ కల్పించింది. ఆయా ప్రాంతాల్లో ప్లాట్ల మార్కెట్ ధరపై 14శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు, మరో 1.5 శాతం పీనల్ రుసుములతో మొత్తం కలిపి స్థానిక రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువపై 15.5శాతం రెగ్యులరైజేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాది జూన్ చివర వరకు అనధికారిక ఓపెన్ ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకునే వారికి ఫీజులో 25శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. అప్పట్లో అర్హమైనవిగా గుర్తించిన అధికారులు 20,42,944 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించేందుకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. మరో 5 లక్షలకుపైగా దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇప్పటి వరకు 5,92,649 దరఖాస్తుదారులు 25 శాతం రాయితీ కింద ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా పరిశీలన చేసి క్లియరెన్స్ ఇస్తే ప్రొసీడింగ్స్ పూర్తయినట్లు భావించి మున్సిపల్ శాఖ అధికారులు ప్రొసీడింగ్స్ ఇస్తారు. అయితే ఇప్పటి వరకు 1,99,430 దరఖాస్తుదారులకు మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

## టెన్త్‌తో 95.15% ఉత్తీర్ణత

మొదటి పేజీ తరువాయి

చివరి స్థానంలో నిలిచింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 99.10 శాతం ఉత్తీర్ణత నమోదవడం విశేషం. ఇక మీడియంల వారీగా చూస్తే.. ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు 95.86 శాతంతో సత్తా చాటగా, తెలుగు మీడియంలో 89.14 శాతం, ఉర్దూ మీడియంలో 86.71 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది విద్యాశాఖ రెండు కీలక మార్పులు చేసింది. గతంలో మాదిరిగా గ్రేడ్లు కాకుండా, ఈసారి సబ్జెక్టుల వారీగా మార్కులను వెల్లడించారు. అంతేకాకుండా, విద్యార్థుల సౌలభ్యం కోసం తొలిసారిగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే సదుపాయాన్ని కల్పించారు. మరోవైపు, ఫలితాలపై రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు రేపటి నుంచి మే 15 వరకు అవకాశం కల్పించారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 5 –12 వరకు నిర్వహించనుండగా, ఈ పరీక్షల ఫీజు చెల్లింపునకు మే 14వ తేదీని గడువుగా నిర్ణయించారు.

## నేడు ఏపీ టెన్త్ ఫలితాలు విడుదల

**ఉదయం 11 గంటలకు రిలీజ్**

అమరావతి, ఏప్రిల్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు గుడ్‌న్యూస్. టెన్త్ ఫలితాల విడుదలపై అధికారిక ప్రకటన వచ్చేసింది.. గురువారం ఉదయం 11 గంటలకు ఫలితాలను విడుదల చేయబోతున్నట్లు మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. టెన్త్ విద్యార్థులకు మంత్రి కొన్ని సూచనలు చేశారు.. పదో తరగతి ఫలితాలు ఏపీ ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా, మనమిత్ర వాట్సాప్, లీప్ యాప్, డిజిలాకర్ యాప్‌తో పాటుగా వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. టెన్త్ ఫలితాలను విడుదల చేసిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా హెడ్‌మాస్టర్లు ఫలితాలను స్కూల్ లాగిన్స్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

## భారతీయుల్లో శివుడి డీఎన్ఏ

మొదటి పేజీ తరువాయి

కొనియాడారు. వైస్ ఛాన్సలర్ తన వాదనను సమర్థించుకోవడానికి శివుని కుటుంబాన్ని ఒక అద్భుతమైన ఉదాహరణగా చూపారు. కైలాస పర్వతంపై ఉండే మహాదేవుని కుటుంబంలో పరస్పర విరుద్ధమైన జీవులు ఎంతో సామరస్యంగా ఉంటాయని వివరించారు. ‘శివుని మెడలో పాము ఉంటుంది. వినాయకుడి వాహనం ఎలుక. పార్వతీ దేవి వాహనం సింహం. కార్తికేయుడి వాహనం నెమలి. అలాగే శివుని ముందు నంది ఉంటుంది. ప్రకృతి సిద్ధంగా చూస్తే పాముకి ఎలుక ఆహారం, నెమలికి పాము ఆహారం, సింహానికి నంది ఆహారం. ఒకరికొకరు శత్రువులైనప్పటికీ.. వీరంతా మహాదేవుని ఇంట్లో కలిసికట్టుగా ఉంటారు. విభిన్న జాతులు, మతాలు, వర్గాలకు చెందిన మనం భారతీయులుగా కలిసి ఉండాలనేది సనాతన సంస్కృతి నేర్పే గొప్ప పాఠం’ అని పేర్కొన్నారు.

## భూ విలువ20% పెంపు!

మొదటి పేజీ తరువాయి

రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో ప్రాథమిక చర్చలు జరిపిన ఈ బృందం.. మే 10వ తేదీ తర్వాత తుది నివేదికను సమర్పించనుంది. ఈ నివేదిక అందిన తర్వాతే భూముల మార్కెట్ విలువల పెంపుపై స్పష్టత రానుంది. అయితే, అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా రికార్డుల సేకరణలో జాప్యం జరుగుతోందని తద్వారా కొత్త విలువల అమలుకు కనీసం మరో రెండు నెలల సమయం పట్టవచ్చునని తెలుస్తోంది. భూముల విలువల పెంపు వ్యవహారం ప్రభుత్వంలో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మే మొదటి వారం నుంచే కొత్త విలువలు అమలులోకి వస్తాయని ప్రకటించారు. దీనిపై రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. తన శాఖకు సంబంధించిన కీలక నిర్ణయాలను తన దృష్టికి తీసుకురాకుండా ఏకపక్షంగా ప్రకటించటం ఆయన అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల సమీక్ష కోసం వచ్చిన అధికారులను మంత్రి కలవకపోవడం, ఈ అంతర్గత విభేదాలకు నిదర్శనంగా నిలుస్తున్నట్లు తెలిసింది.

## కవిత మర్యాద కోల్పోయింది!

మొదటి పేజీ తరువాయి

వారికి అభినందనలు తెలియజేశారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి.. కేసీఆర్ లాంటి ఒక ఉద్యమ కారుడి కుమార్తెగా తనకు ఉన్న బాధ్యతను కవిత గుర్తు చేసుకోవాలని ఈ సందర్భంగా హితవు పలికారు. తన మొట్టమొదటి సమావేశంలోనే తండ్రిని విమర్శించడం ద్వారా కవిత సమాజంలో తనకు ఉన్న మర్యాదను కోల్పోయారని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమం చేసిన కేసీఆర్‌పై కవిత విమర్శలు చేయడం వ్యక్తిగతంగా తనకు బాధ కలిగించిందని వెల్లడించారు. కన్న తండ్రికి గౌరవం ఇవ్వని కవిత.. ఇక తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎలా ఆదర్శంగా నిలుస్తారని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రశ్నించారు.

# భారత్‌కు యూఏఈ ‘స్పెషల్’ ట్రీట్మెంట్

మొదటి పేజీ తరువాయి

మేలు చేయనుంది. ఇకపై చమురు సరఫరా విషయంలో యూఏఈ స్వతంత్రంగా వ్యవహరించనుంది. దీనిలో భాగంగానే ఇండియాకు భారీ స్థాయిలో, ప్రత్యేక మార్గంలో చమురు సరఫరా చేయాలని నిర్ణయించింది. చమురు ఉత్పత్తి చేసే ఒపెక్ గ్రూపు నుంచి వైదొలగుతున్నట్లు మంగళవారం యూఏఈ ప్రకటించింది. మే 1 నుంచి ఈ నిర్ణయం అమలులోకి రానుంది. అంటే, ఇకపై చమురు ఉత్పత్తి, రవాణా, సరఫరా వంటి విషయాలలో ఒపెక్ నిర్ణయాలు, కట్టుబాట్లతో యూఏఈకి ఎటువంటి సంబంధం ఉండదు. ఈ అంశంలో గతంలో సౌదీ అరేబియా రూపొందించిన నిబంధనలను పాటించాల్సిన అవసరం ఉండదు. అందు వల్ల చమురు ఉత్పత్తి, రవాణా, వాణిజ్యం వంటి అంశాల్లో యూఏఈ స్వతంత్రంగా వ్యవహరిస్తుంది. దీనిలో భాగంగానే ఇండియాకు చమురు సరఫరా చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఒపెక్ నుంచి బయటకు రావడం వల్ల యూఏఈ తన




సామర్థ్యానికి తగ్గట్లుగా చమురు ఉత్పత్తి చేస్తుంది. అలాగే, ఒపెక్ గ్రూపునకు ప్రత్యేకంగా చమురు కేటాయించాల్సిన అవసరం లేదు. గతంలో యూఏఈ ఎంత చమురు ఉత్పత్తి చేయాలో ఒపెక్ నిర్ణయించేది. యూఏఈ చమురు ఉత్పత్తి సామర్థ్యాన్ని ఒపెక్ రోజుకు 3.4 మిలియన్ బ్యారెళ్లకు మాత్రమే పరిమితం చేసింది. అయితే, అంతకంటే ఎక్కువే ఉత్పత్తి చేయగల సామర్థ్యం యూఏఈకి ఉంది. మార్కెట్లోకి చమురు ఎక్కువగా ఉత్పత్తి అయితే, ధరలు తగ్గుతాయని ఒపెక్ ఈ నియంత్రణ విధించింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో చమురు ఉత్పత్తి పెంచుకోవాల్సిన అవసరం ఉందని యూఏఈ భావిస్తోంది. ఇకపై రోజూ 4.8 మిలియన్ బ్యారెళ్ల నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల వరకు ఉత్పత్తి చేయాలని యూఏఈ నిర్ణయించింది. ప్రస్తుతం హోర్ముజ్ జలసంధిని అమెరికా, ఇరాన్ దిగ్బంధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో హోర్ముజ్ బైపాస్ మార్గం ద్వారా, హబ్సన్–ఫ్యుజైరా పైప్ లైన్ మార్గం ద్వారా ఇండియాకు చమురును సరఫరా చేయాలని యూఏఈ నిర్ణయించింది. ఇండియాకు కూడా ఈ మార్గం చాలా ఉపయోగకరం. భారత కంపెనీలు ఇక్కడి నుంచి చమురు తీసుకెళ్లడం సులభమవుతుంది. మనకు అవసరమైన చమురు ఉత్పత్తిలో 9–10 శాతం యూఏఈ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. యూఏఈ నిర్ణయం వల్ల దేశానికి ఎల్ఎన్‌జీ సరఫరా మెరుగవుతుంది.

# ఐవీఎఫ్‌తో కవలలకు గాంధీ ప్రాణం

## ఉచితంగా ఐవీఎఫ్, డెలివరీ.. పది సంవత్సరాల నిరీక్షణకు తెర.. డాక్టర్లకు మంత్రి దామోదర అభినందనలు

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బోయగూడలో నివసిస్తున్న గడ్డం త్రివేణి-మస్తాన్‌రావు దంపతులు పది సంవత్సరాలుగా పిల్లల కోసం ప్రయత్నిస్తున్నారు. వారి పదేండ్ల నిరీక్షణకు బుధవారం గాంధీ హాస్పిటల్‌లో శుభం కార్డు పడింది. గాంధీ హాస్పిటల్‌లోని ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చేయించుకున్న ఆ దంపతులు, బుధవారం అదే హాస్పిటల్‌లో కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఒక బాబు, ఒక పాపతో ఇప్పుడు ఆ దంపతులు సంతోషంగా ఉన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఇదే చికిత్సకు రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు ఖర్చయ్యే అవకాశం ఉండగా, గాంధీ హాస్పిటల్‌లో పూర్తిగా ఉచితంగా చికిత్సతో పాటు డెలివరీ కూడా చేశారు. అవసరమైన అన్ని మెడిసిన్స్ ఉచితంగా అందజేశారు.

**ప్రైవేటులో 13 ప్రయత్నాలు విఫలం**

వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్న ఈ దంపతులు పది సంవత్సరాలుగా సంతానం కోసం ఎదురుచూశారు. ఈ క్రమంలో ఎన్నో ప్రైవేటు ఆస్పత్రులు తిరిగి చికిత్సలు చేయించుకున్నప్పటికీ ఫలితం రాలేదు. బయట ఆస్పత్రుల్లో 13 సైకిళ్ల ఓవ్యులేషన్ ఇండక్షన్, ఒకసారి ఐయూఐ చికిత్స చేయించుకున్నా సంతానం కలగలేదని త్రివేణి దంపతులు వెల్లడించారు. చివరకు గాంధీ ఆస్పత్రి ఐవీఎఫ్ సెంటర్‌ను ఆశ్రయించగా, వైద్యులు పరీక్షలు చేసి సమస్యను గుర్తించి ఐవీఎఫ్ చికిత్స అందజేశారు. ఐవీఎఫ్ ద్వారా గర్భం దాల్చినప్పటి నుంచి డెలివరీ వరకూ గాంధీలోనే అవసరమైన వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం తల్లి, శిశువులు ఆరోగ్యంగా ఉన్నట్లు డాక్టర్లు తెలిపారు.

**అభినందనలు తెలిపిన మంత్రి**

ఈ సందర్భంగా గాంధీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి, ఐవీఎఫ్ సెంటర్ హెడ్, డాక్టర్ టి. శోభ, డాక్టర్ ఫాతిమా, డాక్టర్ శివకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ లావణ్య, సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. గాంధీ, పేట్లబుర్జు హాస్పిటల్స్‌లో తాము ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్లు ప్రజలకు ఉపయోగపడుతుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అత్యాధునిక సంతానోత్పత్తి చికిత్సలు విజయవంతంగా అందుతున్నాయని, పేదలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.




## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

# ఇద్దరు ప్రియుళ్లతో కలిసి భర్తపై దాడి

**తమిళనాడులో ఏపీ వ్యక్తి దారుణ హత్య**

చెన్నై: రోజు రోజుకూ మానవ సంబంధాలు మంటగలిసి పోతున్నాయి. వివాహేతర సంబంధాలు పచ్చని కాపురాల్లో చిచ్చురేపుతున్నాయి. కట్టుకున్నవాళ్లను కడతేర్చడానికి కూడా వెనుకాడటం లేదు. భర్తలను అత్యంత దారుణంగా హత్యచేస్తున్న ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా, మరో మహిళ తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను ఇద్దరు ప్రియుళ్ల సాయంతో హత్యచేసింది. గొంతునులిమి ప్రాణాలు తీసి, సాధారణ మరణంగా నమ్మించే ప్రయత్నం చేసి, చివరకు దొరికిపోయింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి భార్య చేతిలో హత్యకు గురైన ఈ ఘటన తమిళనాడులోని వేలూరు జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పం పట్టణానికి చెందిన రాజేంద్రన్ కుమారుడు కృష్ణమూర్తి (29) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఎనిమిదేళ్ల కిందట బెంగళూరులో నిర్మాణ పనులు కోసం వెళ్లిన సమయంలో తమిళనాడులోని వేలూరు జిల్లా మేల్‌పల్లిపట్టుకి చెందిన యువతి మోనిషా (23)తో అతడికి ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కుటుంబాలను ఒప్పించి పెళ్లిచేసుకున్న చేసుకున్న వీరికి ఆరేళ్ల కుమార్తె, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో కృష్ణమూర్తి తన భార్యపిల్లలను మేల్‌పల్లిపట్టులో ఉంచి.. బెంగళూరులో పని చేస్తూ వారానికోసారి వచ్చి వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో మోనిషా అదే ప్రాంతానికి చెందిన అన్బళగన్, సుబ్రమణి అనే ఇద్దరు వ్యక్తులతో ఆమెకు ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారితీసింది. భార్య ప్రవర్తన గురించి తెలియడంతో ఆమెను పలుమార్లు మందలించిన కృష్ణమూర్తి.. తీరు మార్చుకోవాలని హెచ్చరించాడు. కానీ, మోనీషా మాత్రం భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుని ఇద్దరు ప్రియుళ్లతో కలిసి పథకం వేసింది. ఈ క్రమంలో బెంగళూరు నుంచి భర్త ఇంటికి రావడంతో తన ప్లాన్ అమలు చేసింది. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉండగా కృష్ణమూర్తి తినే ఆహారంలో నిద్రమాత్రలు కలిపింది. అనంతరం పిల్లలను బయట నిద్రపుచ్చి, అన్బళగన్, సుబ్రమణిలను ఇంటికి రప్పించింది. దీంతో ముగ్గురూ కలిసి నిద్రపోతున్న కృష్ణమూర్తి గొంతునులిమి చంపేశారు. ఉదయం ఏమీ తెలియనట్టుగా డ్రామాలు ఆడింది. ఆయన రక్తపు వాంతులు చేసుకుంటున్నాడని అంబులెన్స్‌కి సమాచారం ఇచ్చింది. దీంతో అక్కడకు వచ్చిన అంబులెన్స్ సిబ్బంది అతడిని పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కానీ, కృష్ణమూర్తి తండ్రికి కోడలి తీరుపై అనుమానం వచ్చింది. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదయ్యింది. మృతదేహాన్నిస్వాధీనం చేసుకుని పోస్టుమార్టానికి తరలించిన పోలీసులు.. మోనిషాను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో తానే భర్తను చంపినట్టు బయటపడటంతో మోనిషా.. ఆమె ఇద్దరు ప్రియుళ్లు అన్బళగన్, సుబ్రమణిలను పోలీసులు అరెస్టు చేశారు.




## మంత్రి పదవి అడగలేదు

**మంత్రి పదవి ఇస్తానని కాంగ్రెస్ చెప్పలేదు**

**కేసీఆర్ హయాంలో భయంతో బతికాం**

**మార్పు కోసమే పార్టీ : కోదండరాం**

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): తనకు మంత్రి పదవి ఇస్తామని కాంగ్రెస్ చెప్పలేదని, తాను కూడా అడగలేదని టీజేఎస్ అధినేత కోదండరాం స్పష్టం చేశారు. అయితే, తన పార్టీ నాయకులకు ప్రభుత్వం త్వరలోనే నామినేటెడ్ పోస్టులు ఇస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామ్యం ఉండాలని కోరుకుంటున్నట్లు ఆయన బహిరంగంగానే చెప్పారు. కేసీఆర్ హయాంలో ప్రజలు మరియు నాయకులు ఒక రకమైన 'భయం' నీడలో బతికారని ఆయన ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ వంటి అంశాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, "ఇంట్లో ఫోన్ పెట్టి జాగ్రత్తగా రమ్మనే పరిస్థితి ఉండేది" అని వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రజల నుంచి దూరమయ్యారని, అందుకే ఇప్పుడు మళ్లీ ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇక కవిత కొత్త పార్టీ పెట్టిన నేపథ్యంలో స్పందిస్తూ.. ఆమె తన మాటల ద్వారా కుటుంబ లోపాలను బయటపెడుతున్నారని, పార్టీ అంటే కేవలం కుటుంబమే అని ఆమె చర్యలు నిరూపిస్తున్నాయని విమర్శించారు. తాము కేవలం ఎన్నికల కోసం కాకుండా 'మార్పు' కోసం పార్టీని నడుపుతున్నామని, అయితే అన్ని ఎన్నికలకూ దూరంగా ఉండలేమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో (బహుశా మున్సిపల్ లేదా జీహెచ్ఎంసీ) కచ్చితంగా పోటీ చేస్తామని, ముందుగానే నియోజకవర్గాలను ఎంచుకుని పనిచేస్తామని ప్రకటించారు.

## రేవంత్ రెడ్డి కుంభకర్ణ: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): తాను మారిన మనిషినని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్నారని, అయితే ఆయన చెప్పినదాంట్లో నిజం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఎన్నికలకు ముందు ఆయన దానవీరశూరకర్ణ అయితే, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు అయ్యాడని ఎద్దేవా చేశారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీలకు నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఆయన పాలమూరు బిడ్డ, ఇప్పుడు కనీసం పాలమూరు ప్రాజెక్టును పట్టించుకోని బిడ్డ అని ఎద్దేవా చేశారు. నాగర్ కర్నూలు, పాలమూరులలోనే రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేస్తుంటే సిగ్గనిపించడం లేదా అని మండిపడ్డారు. విద్యుత్ ఇవ్వడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నారని, రైతు బంధు ఖాతాల్లో పడటం లేదని, వీటికి ఆయనకు సిగ్గనిపించడం లేదా అని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నాయకులు తిడుతుంటే తనకు పైశాచిక ఆనందం వస్తుందని రేవంత్ రెడ్డి చెబుతుంటే విడ్డూరంగా ఉందని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తమ గ్రామాలు, మండలాల్లో ఉండే సమస్యలపై పోరాటం చేయాలని సూచించారు. మరో సంవత్సరం తర్వాత రేవంత్ రెడ్డి చెబితే, కూర్చున్న కుక్క కూడా లేవదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# వదంతుల వల్లే పెట్రో కొరత

## అసాధారణ డిమాండ్‌తోనే బంకులు ఖాళీ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): తెలంగాణలో గత మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో నెలకొన్న పెట్రోల్, డీజిల్ కొరతపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. ఇంధన ధరలు భారీగా పెరగబోతున్నాయంటూ వ్యాపించిన వదంతుల వల్లే ఈ కృత్రిమ కొరత ఏర్పడిందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ప్రజలు ఆందోళనతో అవసరానికి మించి ఇంధనాన్ని కొనుగోలు చేస్తుండటంతో బంకుల వద్ద భారీ రద్దీ ఏర్పడి, డిమాండ్ అకస్మాత్తుగా పెరిగిందని వివరించారు. ఈ పరిస్థితికి పలు కారణాలు దోహదం చేశాయని ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమ బెంగాల్ ఎన్నికల తర్వాత ఇంధన ధరలు పెరుగుతాయనే ప్రచారం ప్రజల్లో ఆందోళన రేకెత్తించింది. దీనికి తోడు పారిశ్రామిక అవసరాలకు వాడే డీజిల్ ధర లీటరుకు రూ.150కి చేరడంతో ఆ వినియోగదారులు కూడా తక్కువ ధరకే లభించే సాధారణ బంకులపై ఆధారపడుతున్నారు. ఇదే సమయంలో ఏపీ, మహారాష్ట్ర వంటి సరిహద్దు రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలు కూడా తెలంగాణలోని బంకుల్లోనే ఇంధనం నింపుతుండటంతో డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. దీంతో వచ్చిన సరుకు వచ్చినట్లే అమ్ముడైపోయి, బంకుల వద్ద 'నో స్టాక్' బోర్డులు దర్శనమిచ్చాయి. ఈ సంక్షోభాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఇంధన సరఫరాను సాధారణం కంటే 126 శాతం పెంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరాను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర చమురు కంపెనీలకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,100 ట్యాంకర్లను నిరంతర సరఫరా కోసం రంగంలోకి దించారు. ఈ నెల 27వ తేదీ నాటికి రోజువారీ డీజిల్ పంపిణీ 151 శాతం, పెట్రోల్ పంపిణీ 95 శాతానికి పెరిగింది. ప్రస్తుతం పంట కోతలు, ధాన్యం కొనుగోళ్ల సమయం కావడంతో రైతులకు, రవాణా రంగానికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల్లోని నిల్వలను సమీక్షిస్తూ, కొరత ఉన్న ప్రాంతాలకు తక్షణమే ట్యాంకర్లను పంపిస్తున్నారు. ప్రజలు వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని, రాష్ట్రంలో ఇంధన నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.




## కేటీఆర్, హరీశ్‌పై కాంగ్రెస్ నేత సంపత్ దావా

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ సీనియర్ నేత హరీశ్ రావులపై ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ పరువు నష్టం దావా వేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో వారిపై దావా వేశానని ఆయన తెలిపారు. వారు తనపై, కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. మూడు నెలల క్రితం జరిగిన చిన్న సంఘటనను ఆధారంగా చేసుకుని తనపై వారు తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. వారు తమ సొంత మీడియా, సోషల్ మీడియాలో తమపై అసత్య ప్రచారం చేసి, తమ ప్రతిష్ఠకు భంగం కలిగిస్తున్నారని వాపోయారు. వారు నీచ రాజకీయాలు చేస్తున్నారని, కానీ అలాంటిది సరికాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై లేదా తనపై తప్పుడు ప్రచారాలు చేయడాన్ని తాము సహించేది లేదని అన్నారు.

# హర్యానాలో ఏపీ టెకీ దారుణ హత్య


గుడివాడ, ఏప్రిల్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌కు చెందిన టెకీ హర్యానాలో దారుణ హత్యకు గురయ్యాడు. కృష్ణా జిల్లా గుడివాడ బేతవోలుకు చెందిన బండ్ల రిషికేష్ (27) పది రోజుల కిందటే హర్యానా పంచకులలోని 'వేది టెక్నాలజీస్' అనే సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరారు. మార్చి 30 హైదరాబాద్ నుంచి బయలుదేరిన రిషికేష్.. ఏప్రిల్ 1న రిపోర్ట్ చేశారు. ఈ క్రమంలో పంచకులలోని పింజోర్ అమరావతి ప్రాంతంలో ఓ గదిని ఏప్రిల్ 4న అద్దెకు తీసుకున్నాడు. అయితే, గురువారం ఉదయం చాలా సేపటి వరకూ టెకీ బయటకు రాకపోవడంతో ఇంటి యజమాని తలుపుకొట్టాడు. అయినా లోపలి నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో ఆయన ఆందోళనకు గురైన పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు అక్కడకు చేరుకుని తలుపులను తెరిచి చూడగా రిషికేష్ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. ఘటనా స్థలంలో ఒక కూరగాయల కత్తిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దానిపై రక్తపు మరకలు కూడా ఉన్నట్టు గుర్తించారు. ఆ గదిలో హతుడి మొబైల్‌తో పాటు మరో ఫోన్ కూడా లభ్యమైంది. ఆ ఫోన్ లాక్ చేసి ఉండటంతో, ఎటువంటి సమాచారం లభించలేదని పోలీసులు తెలిపారు. రిషికేష్ కుటుంబానికి పోలీసులు సుమారు 50 సార్లు ఫోన్ చేసినా.. కాల్స్‌కు సమాధానం ఇవ్వలేదు. దీంతో గుడివాడ పోలీసులకు ఈ సంఘటన గురించి సమాచారం అందించారు. రిషికేష్ తల్లిదండ్రులకు గుడివాడ వన్‌టౌన్ పోలీసులు ఈ వార్తను చేరవేశారు. ఉన్నత చదువులు చదివిన కొడుకు తమ కష్టాలను తీర్చుతాడని ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ తల్లిదండ్రులకు తీరని వేదన మిగిల్చింది. ఈ సమాచారం అందుకున్న వెంటనే కుటుంబ సభ్యులు హర్యానాకు బయలుదేరి వెళ్లారు. ఇదిలా ఉండగా, ఆ గదిలోని గోడలపై రక్తంతో ఇంగ్లీషు, ఇతర భాషలలో రాసిన సందేశాలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ సందేశాన్ని అర్థంచేసుకోవడానికి తాము ప్రయత్నిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఇంగ్లీషులో ఉన్న ఒక్క లైన్ "నేను పోలీసులకు ఫోన్ చేయలేకపోతున్నాను" అని స్పష్టంగా ఉంది. తొలుత అతడు కత్తితో పొడుకుని ఆత్మహత్య చేసుకుని ఉంటారని పోలీసులు భావించారు. కానీ, రిషికేష్ ఒంటిపై ఉన్న గాయాలను తీరును బట్టి అది హత్యగా నిర్ధారణకు వచ్చారు. ఇక, ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు.. దర్యాప్తు చేపట్టారు. రుషికేశ్ చివరిగా ఎవరితో మాట్లాడాడు.? గదికి ఎవరెవరు వచ్చారు..?





## ఎల్లమ్మ పట్నాల వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో పుల్ల వారి రేణుక ఎల్లమ్మ పట్నాలు బోనాలు జాతర మహోత్సవ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు దయాళ చంద్రకళ శంకర్,చెట్టే గంగాధర్, ఏనుగుల లావణ్య రాజు, పిట్ట ధర్మరాజు, కూతురు రాజేశ్, కూతురు, శేఖర్, కురుమ సంఘం నాయకులు పుల్ల మల్లయ్య గట్టు రాజు గంగ మల్లయ్య, చెట్టే భార్గవ్, కోరే గంగాధర్, కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఎల్లమ్మ బోనాల పండుగకు జీవన్ రెడ్డి హాజరు

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడలో రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల పండుగలో మాజీ మంత్రి బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ కుర్మ సోదరులు 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి బోనాలు కార్యక్రమానికి తనను ఆహ్వానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జీవాలకు, పంట పొలాలకు, మనపైన ఎల్లమ్మ తల్లి కృప ఉండాలి అన్నారు. మన ప్రాంతంతో పాటు యావత్తు సమాజాన్ని తల్లి చల్లగా చూడాలని జీవన్ రెడ్డి ఆకాంక్షించారు.

## క్వీన్ ఆఫ్ సబ్‌స్టాన్స్ పోటీల్లో ఎన్నారై పల్లవి విజయం



జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): న్యూఢిల్లీలో నిర్వహించిన మిసెస్ ఇండియా క్వీన్ ఆఫ్ సబ్‌స్టాన్స్--2026 (సీజన్ 15) పోటీల్లో సౌదీ అరేబియాకు చెందిన ఎన్ఆర్ఐ పల్లవి సోనవానే సఫైర్ విభాగంలో సెకండ్ రన్నర్-అప్‌గా నిలిచారు. ఐటీసీ వెల్కమ్ హోటల్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో ఈ ఘనత సాధించారు. 'బ్యూటీ విత్ ఎ పర్పస్' థీమ్‌తో నిర్వహించిన ఈ పోటీలో దేశ విదేశాల నుంచి వచ్చిన పోటీదారులను అధిగమించి విజయం సాధించారు. 23 సంవత్సరాలుగా సౌదీ అరేబియాలో నివసిస్తున్న పల్లవి, ఉపాధ్యాయురాలు, వ్యాపారవేత్త, నర్తకిగా గుర్తింపు పొందారు. మహిళల సాధికారతకు కృషి చేస్తూ అనేక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆమె విజయంపై ఇండియన్ ఓవర్సీస్ ఫోరమ్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు.




## పిల్లలు, మహిళలకు 'భరోసా'

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): మహిళలు, పిల్లల భద్రతపై భరోసా సెంటర్ సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పనిచేస్తున్న మహిళలకు పని ప్రదేశాల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై చట్టపరమైన రక్షణలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఫిర్యాదు చేయడానికి హెల్ప్‌లైన్ నంబర్లు, భరోసా సెంటర్ సేవలు, పోలీస్ సహాయంపై అవగాహన కల్పించారు. చిన్నారుల రక్షణలో భాగంగా పోక్సో చట్టంపై కూడా వివరించి, అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని సూచించారు. సమస్యలు వచ్చినప్పుడు భరోసా సెంటర్, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటాయని తెలిపారు.



## ఎల్లమ్మ బోనాల జాతరలో భోగ శ్రావణి

జగిత్యాల, ఏప్రిల్29 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలో నిర్వహించిన పుల్ల రేణుక ఎల్లమ్మ పట్నాల బోనాలు జాతర మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ప్రవీణ్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, శాంతి సౌభాగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. జాతర సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పుల్ల హరీష్-సుమలత, పుల్ల గట్టయ్య, బండారి మల్లేశం, ముద్దం నాగరాజు, కాశెట్టి తిరుపతి, జున్ను రాజేందర్, మీరుపిత్తుల మధు, పుల్ల రాజేందర్, పవన్ సింగ్, గంగరాజం కురుమ సంఘం సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# వద్దురో.. సర్కారు దవాఖాన!


**జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణ పరిస్థితులు**

**మౌలిక వసతుల కొరతతో రోగుల తీవ్ర ఇబ్బందులు**

జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందని రోగులు, వారి బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాథమిక సదుపాయాల లేమితో చికిత్స పొందేందుకు వచ్చే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రిలో ఈసీజీ, ఎక్స్‌రే పరీక్షల రిపోర్టులకు పేపర్ లేకపోవడంతో సిబ్బంది వాటిని ప్రింట్ ఇవ్వకుండా మొబైల్ ఫోన్లలో చూపిస్తూ పంపిస్తున్నారని తెలుస్తోంది. దీంతో కెమెరా ఫోన్ లేని వృద్ధులు, పేదవర్గాల వారు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రోగులకు "డాక్టర్‌కి పంపించాం" అంటూ సరైన వివరాలు ఇవ్వకుండా పంపించే పరిస్థితులు ఉన్నాయని బాధితులు పేర్కొంటున్నారు. ఇక ఆసుపత్రిలో గత ఆరు నెలలుగా స్పిరిట్ లభించకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ప్రాథమిక వైద్య సేవలకు అవసరమైన ఈ పదార్థం లేకపోవడం వల్ల చికిత్సలో అంతరాయం కలుగుతోందని రోగులు చెబుతున్నారు. అదేవిధంగా మోనోసెఫ్ వంటి ముఖ్యమైన యాంటీబయోటిక్ ఇంజక్షన్లు అందుబాటులో లేకపోవడంతో రోగులు బయట ఫార్మసీల నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనివల్ల ఆర్థిక భారం పెరుగుతోందని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అపరిశుభ్రతతో ఇన్ఫెక్షన్ ముప్పు**

పరీక్షల సమయంలో ఆసుపత్రిలో తగిన శుభ్రత పాటించకపోవడం వల్ల ఇన్ఫెక్షన్ల ముప్పు పెరుగుతోందని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సేవలు పొందడానికి వచ్చే ప్రజలకు ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు. ఆసుపత్రిలో తక్షణమే అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని, మందులు, వైద్య సామగ్రి సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయం: కలెక్టర్

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): రైతులు తమ ధాన్యాన్ని తప్పనిసరిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలంలోని చల్ గల్, తాటిపెల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, వేగంగా కొనుగోళ్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం స్వీకరణ విధానం, తూకం ప్రక్రియ, 17 శాతం తేమ ప్రమాణాల నిర్వహణ, కేంద్రాల వద్ద ఉన్న మౌలిక వసతులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యంలోని తేమ శాతాన్ని తప్పనిసరిగా పరీక్షించి, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్లు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే వాహనాల ద్వారా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్లస్టర్ అధికారులకు కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన బరువు యంత్రాలు సక్రమంగా పనిచేయడం, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, త్రాగునీరు, షేడ్ నెట్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉంచడం, కొనుగోళ్లను నిరంతరం పర్యవేక్షించడం అవసరమని తెలిపారు. వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని టార్పాలిన్ కవర్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.





## టెన్త్ ఫలితాల్లో జగిత్యాల నం.4

జగిత్యాల, ఏప్రిల్ 29: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో జగిత్యాల జిల్లా అద్భుత విజయంతో 98.87శాతంతో రాష్ట్రంలోనే 4వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ జిల్లా మొత్తంగా 12687 మంది విద్యార్థులకు గాను 12544 మంది విద్యార్థులు అద్భుతంగా విజయాన్ని సాధించారని, గతంలో నాలుగవ స్థానం మరియు ఇప్పుడు కూడా అదే స్థానాన్ని నిలుపుకోవడం ఇట్టి విజయానికి కృషిచేసిన జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, వివిధ మండలాల విద్యాధికారులను, పాఠశాల సిబ్బందిని, విద్యార్థులను, తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలుపుతూ ఇదే స్ఫూర్తిని మునుముందు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ విజయానికి విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకం, తల్లిదండ్రుల సహకారం ప్రధాన కారణమని తెలిపారు. ఇదే ఉత్సాహంతో భవిష్యత్తులో విజయాలు సాధించి జిల్లాకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్, జిల్లా విద్యాధికారి కె.రాము, ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, విద్యాశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అధికారుల కండ్లకు కనిపిస్తలే?

**ఒక పరిశ్రమ సీజ్.. మిగతా రెండింటిపై నో యాక్షన్**

**ఇండ్ల మద్యే ఇనుప బోల్టుల తయారీ పరిశ్రమలు**

**వాయు, ధ్వని కాలుష్యంతో స్థానికుల ఇబ్బందులు**

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): హైదరాబాద్ నడిబొడ్డున, ఇండ్ల మధ్య పరిశ్రమలు ప్రజలకు ఇబ్బందిగా మారుతున్నాయి. కవాడిగూడ సర్కిల్ 40 పరిధి లోని బన్సీలాల్ పేట డివిజన్ అరుణ్ జ్యోతి కాలనీలో అక్రమంగా నడుస్తున్న ఇనుప బోల్టు తయారీ కేంద్రాల కారణంగా స్థానికులు నానానరకయాతనలు పడుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం లేదు. ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినా, హైకోర్టును ఆశ్రయించినా.. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన అధికారులు తూతూ మంత్రంగా విచారణ చేపట్టి కాలనీలోని రెండు పరిశ్రమల ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేశారు. ఆ తర్వాత ఒక పరిశ్రమను సీజ్ చేశారు. అయితే, మరో రెండు పరిశ్రమలను ముట్టుకోకుండా జారుకున్నారు. ఒకే పరిశ్రమను మూసేయించి, మిగతా వాటి జోలికి వెళ్లకపోవడంపై స్థానికులు అధికారులపై మండిపడుతున్నారు. దీని వెనకాల ఎవరైనా రాజకీయ నాయకుల హస్తం ఉన్నదా..? లేక అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఈ రెండు పరిశ్రమలను కూడా సీజ్ చేసి, శాశ్వతంగా మరోచోటికి తరలించాలని స్థానికులు ఉన్నతాధికారులను కోరుతున్నారు.



## డ్రగ్స్ నిర్మూలన అందరి బాధ్యత: ఎస్పీ



జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): మాదకద్రవ్యాల నిర్మూలనతో పాటు మహిళలు, పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఐపీఎస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా "చైల్డ్ సేఫ్టీ అండ్ సే నో టు డ్రగ్స్" కార్యక్రమాన్ని వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో పోలీసులు ప్రత్యక్షంగా వెళ్లి డ్రగ్స్ దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబం, సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించిన ఎస్పీ, గంజాయి సరఫరాపై కఠిన నిఘా కొనసాగుతున్నట్లు చెప్పారు. డ్రగ్స్ వినియోగదారులకు కౌన్సిలింగ్ అందిస్తున్నామని తెలిపారు. మహిళలు, పిల్లల భద్రతపై ఎటువంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రజలు సహకరించాలని పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సంజయ్

సారంగాపూర్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలానికి చెందిన గుర్రం మధు--పావని దంపతులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన గృహాన్ని నేడు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారి ఆహ్వానం మేరకు ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల శాసన సభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన దంపతులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలుపుతూ చీర కానుకగా అందజేశారు. అనంతరం గ్రామానికి చెందిన తిరుపెల్లి దుబ్బమ్మ--కొమురయ్య దంపతుల ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి వారికి కూడా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాజయ్య, సర్పంచ్ మల్యాల శ్రీనివాస్, బాస మహేష్, మాజీ సర్పంచ్‌లు నారాయణరావు, గుర్రం స్వామి, డిల్లీ రామారావు, మల్లేశం, మాజీ ఎంపిటిసీలు సుధాకర్ రావు, సాయిలు, మాజీ పాక్స్ చైర్మన్ సాగి సత్యం రావు, మండల అధికారులు ఎమ్మార్వో వహీద్, ఎంపీడీవో సలీం, డీఈ సత్యనారాయణ, నాయకులు, అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా అడువాల జ్యోతి

జగిత్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా మున్సిపల్ మాజీ చైర్మన్ లయన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆమెకు వివిధ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సమాజ సేవలో విశేష అనుభవం కలిగిన జ్యోతి లక్ష్మణ్ ఈ బాధ్యతలు చేపట్టడం ద్వారా క్లబ్ కార్యకలాపాలకు కొత్త దిశ లభిస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజలకు చేరువగా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించే సామర్థ్యం ఆమెకు ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు, ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా అమలు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.



## అప్పారావుపేటలో ఐకేపీ సెంటర్ ప్రారంభం

కొడిమ్యాల, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం అప్పారావుపేటలో ఐకేపీ సెంటర్ ప్రారంభమైంది. బుధవారం ఎమ్మార్వో నరేశ్ వద్ద కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మల్లేశం, సర్పంచ్ వినీల నరసింహారెడ్డి, ఉపసర్పంచ్ రేకులపల్లి తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఉపాధి పని కోసం నిర్వహించిన కసరత్తు కార్యక్రమంలో సర్పంచ్ వినీల, అధికారులు ఈసీ రమాపతి, టీఏ గౌతమి, కార్యదర్శి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## సేవ చేయడంలోనే ఆనందం

**డాక్టర్ గీసులాల్ జైన్**



హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): అందరూ సేవాభావం అలవర్చుకుంటే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలంగాణ చాంబర్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అధ్యక్షుడు డాక్టర్ గీసులాల్ జైన్ తెలిపారు. నల్లకుంట శంకర మఠం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం పాదచారులకు కొర్ర ఉప్మా, మంచినీరు, రస్నా, మజ్జిగ, అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటిదానం ఎంతో గొప్పదని, నిత్యం రద్దీగా ఉండే నల్లకుంట శంకరమఠం వద్ద వేసవికాలంలో మంచినీరు అందిస్తున్న నిర్వాహకులను ఆయన అభినందించారు. చలివేంద్ర ప్రారంభించిన మార్చి 27వ తేదీ నుంచి గత 35 రోజులుగా నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులను ఆయన ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గాయాత్రి మహిళా వాకర్స్ క్లబ్, నల్లకుంట, హ్యాపీ వాకర్స్ క్లబ్, బాగ్ లింగంపల్లి, అవోపా హైదరాబాద్ పాలక వర్గం ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఏపీలో ఎండలు.. వర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 29 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలో రానున్న 24 గంటల్లో కొన్ని జిల్లాల్లో తీవ్ర వడగాల్పులు, మరికొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. వివరాల్లోకి వెళితే, బుధవారం నెల్లూరు జిల్లా కొమ్మిపాడులో రాష్ట్రంలోనే అత్యధికంగా 44.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.



## బీఆర్ఎస్ నాయకుడు నవీన్‌కు రావుల పరామర్శ

హైదరాబాద్, ఏప్రిల్ 29 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసుఫ్ గూడ డివిజన్ బీఆర్ఎస్ నాయకుడు నవీన్ కుమార్ పోగులకి వెన్నుపూస శస్త్రచికిత్స జరిగిన నేపథ్యంలో ఆయనను మాజీ కార్పొరేషన్ చైర్మన్, బిఆర్ఎస్ నాయకుడు రావుల శ్రీధర్ రెడ్డి పరామర్శించారు. పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. నవీన్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో తిరిగి చేరాలని ఆకాంక్షించారు. వీరితో పాటు పార్టీ నాయకులు రాహుల్ పటేల్, కిరణ్ యాదవ్, ఆకాశ్, శ్రీశైలం యాదవ్, సురేందర్ తదితరులు నవీన్‌ను పరామర్శించారు.

## డిసెంబర్ నాటికి అన్ని ప్రభుత్వ సేవలూ ఆన్‌లైన్

అమరావతి, ఏప్రిల్ 29 (ఈవార్తలు): ఏపీలో ప్రభుత్వ శాఖలు అందించే ప్రతీ సేవను ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిగా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అన్ని సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ పరిధిలోకి తీసుకువస్తే, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం నాడు అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్టీజీఎస్) పనితీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నాలజీని ప్రభుత్వ పాలనలో విరివిగా వినియోగించుకోవడంపై పలు కీలక నిర్దేశాలు చేశారు. ప్రస్తుతం 'మన మిత్ర' వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 1,035 సేవలను అందిస్తున్నామని, ఈ విధానం ప్రారంభమైన నాటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా 54 లక్షల మంది పౌరులు 1.78 కోట్ల సేవలను వినియోగించుకున్నారని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# అసోంలో బీజేపీ హవా

**పుదుచ్చేరిలో ఎన్డీయే గెలుపు.. ఎగ్జిట్ పోల్ సర్వేలు**

న్యూఢిల్లీ: నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతం ఎన్నికల ఎగ్జిట్ పోల్స్ విడుదలయ్యాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. పశ్చిమ బెంగాల్‌లో ఈరోజు రెండో దశ పోలింగ్ ముగియడంతో ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వచ్చాయి. అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. అసోంలో 126 స్థానాలకు గాను బీజేపీ కూటమి 80కి పైగా సీట్లు గెలుచుకుంటుందని వివిధ సర్వేలు అంచనా వేస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ 22 నుంచి 30 సీట్లకే పరిమితం కానుంది. ఇతరులు 1 నుంచి 10 సీట్లు గెలుచుకుంటాయని అంచనా వేశాయి. 30 అసెంబ్లీ స్థానాలు ఉన్న పుదుచ్చేరిలోనూ ఎన్డీయే మెజార్టీకి కావాల్సిన సీట్లు గెలుచుకుంటుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. బీజేపీ, మిత్రపక్షాలు 16 సీట్లకు పైగా గెలుచుకుంటాయని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

**అసోం ఎగ్జిట్ పోల్స్**

యాక్సిస్ మై ఇండియా : బీజేపీ 88 - 100, కాంగ్రెస్ 24 - 26 సీట్లు
పీపుల్స్ పల్స్: బీజేపీ 68 - 72, కాంగ్రెస్ 22 - 26 సీట్లు
పీ-మార్క్: బీజేపీ 82 - 94, కాంగ్రెస్ 30 - 40 సీట్లు
మాట్రిజ్ : బీజేపీ 85 - 96, కాంగ్రెస్ 25 - 32 సీట్లు
పీపుల్స్ ఇన్‌సైట్ : బీజేపీ 88 - 96, కాంగ్రెస్ 30 - 34 సీట్లు
జేవీసీ ఎగ్జిట్ పోల్: బీజేపీ 88 - 101, కాంగ్రెస్ 23 - 33 సీట్లు

**పుదుచ్చేరి ఎగ్జిట్ పోల్స్**

పీపుల్స్ పల్స్ : ఎన్డీయే 16 - 19, కాంగ్రెస్ 10 - 12 సీట్లు
చాణక్య స్ట్రాటజీస్ : ఎన్డీయే 17 - 20, కాంగ్రెస్ 9 - 13 సీట్లు
యాక్సిస్ మై ఇండియా : ఎన్డీయే 16 - 20, కాంగ్రెస్ 6 - 8 సీట్లు

## 90 ఏళ్ల వృద్ధురాలి కేసు 2026కు వాయిదా

**మరుసటి రోజే 2026 జులై 15వ తేదీకి మార్పు**

ముంబై: ఒక పరువునష్టం కేసులో 90 ఏళ్ల వృద్ధురాలు మొండిపట్టుదలతో ఉండటంతో, తీవ్ర అసహనం వ్యక్తం చేసిన బాంబే హైకోర్టు న్యాయమూర్తి, కేసును 2046 ఏప్రిల్ 28వ తేదీకి వాయిదా వేశారు. అయితే ఆ తర్వాత ఉత్తర్వులను మార్చారు. సులభంగా పరిష్కారమయ్యే ఈ కేసు సుదీర్ఘకాలంగా కొనసాగుతోందని, ఇలాంటి కేసులు న్యాయవ్యవస్థకు అదనపు భారంగా మారుతున్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఈ కేసు 2015లో ప్రారంభమైంది. పదకొండేళ్ల క్రితం శ్యామ్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో వార్షిక సమావేశం జరిగింది. అక్కడ జరిగిన కొన్ని ఘటనలతో తాను మానసిక వేదనకు గురైనట్టు పేర్కొంటూ 90 ఏళ్ల తరిణిబెన్... పలువురిపై 2017లో రూ.20 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఏప్రిల్ 20న జరిగిన విచారణ సందర్భంగా ఇరుపక్షాలు రాజీకి యత్నించాలని బాంబే హైకోర్టు సూచించింది. ప్రతివాదులు బేషరతుగా క్షమాపణ చెప్పడానికి అంగీకరించినప్పటికీ, వృద్ధురాలు అంగీకరించలేదు. దీనితో కేసు ఎటూ తెగడం లేదు. బాంబే హైకోర్టులో మంగళవారం ఈ కేసు విచారణ జరిగింది. చాలాకాలంగా కొనసాగుతున్న ఈ కేసుపై న్యాయమూర్తి జస్టిస్ జితేంద్ర జైన్ అసహనం వ్యక్తం చేశారు. కొందరు వ్యక్తుల మధ్య జరుగుతున్న పోరు ఇది అని, వ్యవస్థను జామ్ చేస్తోందని వ్యాఖ్యానించారు. ఇలాంటి కేసుల వల్ల అత్యంత ప్రాధాన్యత ఉన్న కేసులను న్యాయస్థానం చేపట్టలేకపోతోందని అన్నారు. ఈ కేసు వేసింది సూపర్ సీనియర్ సిటిజన్ అయినంత మాత్రాన ప్రాధాన్యం ఇవ్వలేమని అన్నారు. 2046లో కేసు విచారణ చేపడతామని పేర్కొన్నారు. అయితే, బుధవారం తన ఆదేశాలను మార్పు చేశారు. 2026 జులై 15వ తేదీకి తదుపరి విచారణను వాయిదా వేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

## చివరి గంటలో ఆవిరి

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాలతో ముగిశాయి. అయితే, రోజంతా కొనసాగిన ఉత్సాహం చివరి గంటలో ఆవిరైంది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతింది. దీంతో ఇంట్రాడే గరిష్ఠాల నుంచి సూచీలు వెనక్కి తగ్గాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 609.45 పాయింట్ల లాభంతో 77,496.36 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181.95 పాయింట్లు పెరిగి 24,177.65 వద్ద ముగిసింది. అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు నిలిచిపోవడం, మే 1 నుంచి ఒపెక్ కూటమి నుంచి వైదొలగుతున్నట్లు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించడంతో సరఫరాపై ఆందోళనలు పెరిగాయి. దీంతో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 3 శాతానికి పైగా పెరిగి బ్యారెల్‌కు 114.60 డాలర్లకు చేరింది. ఈ పరిణామం మార్కెట్ల జోరుకు బ్రేకులు వేసింది. టెక్నికల్ గా చూస్తే, నిఫ్టీకి 24,200 వద్ద కీలక నిరోధకం ఉందని, ఒకవేళ సూచీ కిందకు వస్తే 24,000-24,100 స్థాయి మద్దతుగా నిలుస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. సూచీలు చివరి గంటలో వెనక్కి తగ్గినప్పటికీ ఐటీసీ, టెక్ మహీంద్రా, మారుతీ సుజుకీ వంటి హెవీవెయిట్ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు లాభాల్లో ముగియగలిగాయి. బ్రాడర్ మార్కెట్లు మిశ్రమంగా స్పందించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ స్వల్పంగా నష్టపోగా, స్మాల్‌క్యాప్ సూచీ 0.65 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే ఎఫ్ఎంసీజీ, రియల్టీ షేర్లు రాణించగా, కన్‌స్ట్రక్షన్ డ్యూరబుల్, మీడియా రంగాల సూచీలు నష్టపోయాయి. పెరుగుతున్న చమురు ధరలు, అమెరికా ఫెడ్ పాలసీ నిర్ణయం వంటి అంశాలు సమీప భవిష్యత్తులో మార్కెట్లపై ప్రభావం చూపవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## ఇక నేను చెడ్డోడిని: ట్రంప్

వాషింగ్టన్: ఇక నుంచి తాను మంచివాడిగా ఉండనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొంటూ, తాను రైఫిల్ పట్టుకున్నట్లు ఉన్న ఫొటోను ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో ఆ దేశానికి ఆయన మరోసారి హెచ్చరిక జారీ చేశారు. చర్చల విషయంలో ఇరాన్ సరిగ్గా వ్యవహరించలేకపోతోందని విమర్శించారు. అణు ఒప్పందం ఎలా చేసుకోవాలో వారికి తెలియడం లేదని అన్నారు. ఈ విషయంలో వారు తెలివిగా వ్యవహరిస్తే బాగుంటుందని అన్నారు. ఇక మీదట తాను అంత మంచివాడిగా ఉండనని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం, అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరమైన ప్రతిష్టంబన నెలకొన్న నేపథ్యంలో ట్రంప్ నుంచి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.



## పాక్ ఏమైనా భారత్ లెక్కనా?

ఇస్లామాబాద్: పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాలు ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నిస్తున్న తరుణంలో, పాకిస్థాన్ పెట్రోలియం మంత్రి అలీ పర్వైజ్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ఎంతటి ప్రమాదకర స్థితిలో ఉందో స్పష్టం చేస్తున్నాయి. ఒక దేశానికి నెలల తరబడి సరిపోయే ఇంధన నిల్వలు ఉండటం కనీస అవసరం కాగా, పాకిస్థాన్‌లో కేవలం 5 నుంచి 7 రోజులకు సరిపడా ముడి చమురు మాత్రమే ఉండటం ఆశ్చర్యకరం. ఈ సందర్భంగా భారతదేశపు వ్యూహాత్మక చమురు నిల్వల సామర్థ్యాన్ని పాక్ మంత్రి కొనియాడటం గమనార్హం. "భారత్ తన భూగర్భ గదుల్లో 60 నుంచి 70 రోజులకు సరిపడా భారీ నిల్వలను అత్యవసర పరిస్థితుల కోసం సిద్ధంగా ఉంచుకుంది.

# బెంగాల్‌లో ముగిసిన పోలింగ్

**మే 4న ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ**



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల 2026 తుది సమరం ముగిసింది. రాష్ట్రంలోని 142 నియోజకవర్గాలకు రెండో మరియు చివరి విడత పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అప్పటికే క్యూలైన్లలో ఉన్నవారికి ఓటేసే అవకాశం కల్పించారు. కాగా, నేటి పోలింగ్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో చెదురుమదురు ఘర్షణలు జరిగాయి. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు. సాయంత్రం 5 గంటల సమయానికి ఏకంగా 89.90 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. ఇది ప్రజాస్వామ్యంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని సూచిస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలతో తృణమూల్ కాంగ్రెస్, బీజేపీల భవితవ్యం తేలనుంది. తృణమూల్ కాంగ్రెస్‌కు సాంప్రదాయకంగా బలమైన దక్షిణ బెంగాల్, కోల్‌కతా ప్రాంతాల్లో ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. 2021లో ఈ 142 స్థానాల్లో టీఎంసీ 123 సీట్లు గెలుచుకోవడంతో, ఈసారి కూడా అదే ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికల సంఘం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. 2,400 కంపెనీలకు పైగా కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించింది. ఈ ఎన్నికల్లో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న నియోజకవర్గం భబానీపూర్. ఇక్కడ ముఖ్యమంత్రి మమతా బెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీ చేస్తున్నారు. దీంతో ఈ స్థానంలో హోరాహోరీ పోరు నెలకొంది. వీరితో పాటు టీఎంసీ మంత్రులు ఫిర్హాద్ హకీమ్, అరూప్ బిస్వాస్, శశి పాంజా వంటి ప్రముఖులు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అభిషేక్ బెనర్జీ, మిథున్ చక్రవర్తి, మహువా మొయిత్రా వంటి ప్రముఖ నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సందర్భంగా నదియా జిల్లాలోని చాప్రా, శాంతిపుర్, భాంగర్, హూగ్లీలోని ఖానాకుల్ వంటి ప్రాంతాల్లో టీఎంసీ, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్నిచోట్ల ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తాయని ఆరోపణలు వచ్చాయి. మరోవైపు, కేంద్ర సాయుధ బలగాలు, ఎన్నికల పరిశీలకులు బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, బయటి వ్యక్తులు పోలింగ్ బూత్‌లలోకి చొరబడుతున్నారని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అదే సయయంలో, ప్రజలు, ముఖ్యంగా మహిళలు, యువత ఎలాంటి భయాలకు తావివ్వకుండా రికార్డు స్థాయిలో ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

## ఒక లీటరు ఇథనాల్ కోసం 10,000 లీటర్ల నీరు?

**భారత ఇథనాల్ వ్యూహం బెడిసికొట్టే ప్రమాదం**



న్యూఢిల్లీ: ముడి చమురు దిగుమతులను తగ్గించుకోవడానికి పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపే కార్యక్రమాన్ని భారత్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. దీన్ని 'స్వచ్ఛ ఇంధనం'గా ప్రభుత్వం ప్రచారం చేస్తోంది. అయితే దీని వెనక భయంకరమైన నీటి వృథా దాగి ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇథనాల్ తయారీకి వాడే వరి, చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు చాలా నీరు అవసరం. దీనివల్ల దేశంలో ఇప్పటికే ఉన్న నీటి ఎద్దడి మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం వరి నుంచి ఇథనాల్ తయారీపై ఎక్కువ దృష్టి పెట్టింది. ఇందుకోసం సుమారు 90 లక్షల టన్నుల బియ్యాన్ని డిస్టిలరీలకు మళ్లించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల పేదలకు రేషన్ షాపుల ద్వారా ఇచ్చే బియ్యంలో కోత విధించాల్సిన అవసరం రావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్క లీటరు ఇథనాల్ తయారు చేయడానికి ఏయే పంటల నుంచి ఎంత నీరు ఖర్చవుతుందో చూస్తే ఆందోళన కలగక మానదు. స్థూలంగా వరి నుంచి తయారు చేస్తే 10,790 లీటర్లు, మొక్కజొన్న 4,670 లీటర్లు, చెరకు నుంచి అయితే 3,630 లీటర్లు వాడాల్సి వస్తుంది. ఒక కిలో బియ్యం పండించడానికి సుమారు 3,000 లీటర్ల నీరు అవసరమైతే దాని నుంచి వచ్చే ఇథనాల్ పరిమాణం చాలా తక్కువ. అంటే ఒక్క లీటరు ఇంధనం కోసం మనం వేల లీటర్ల నీటిని వదులుకోవాల్సి వస్తుంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. 2030 నాటికి ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి 21 ప్రధాన నగరాల్లో భూగర్భ పూర్తిగా అడుగంటే ప్రమాదం ఉంది. ప్రస్తుతం దేశంలో ఇథనాల్ తయారీ సామర్థ్యం 1,822 కోట్ల లీటర్లకు చేరింది. అయితే ఈ తయారీ కేంద్రాలు ఎక్కువగా మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక వంటి నీటి ఎద్దడి ఉన్న రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. ఇలాంటి స్థితిలో పారిశ్రామిక అవసరాల కోసం భూగర్భ జలాలను భారీగా తోడటం వల్ల సామాన్యుల బతుకు భారంగా మారుతుంది.

## మేం గెలుస్తున్నాం: మమతా బెనర్జీ

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోల్‌కతాలో తన ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. ఓటు వేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ, బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ అద్భుత విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మూడింట రెండొంతుల మెజారిటీ తమ పార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారు (బీజేపీ) అన్ని చోట్ల ఓడిపోతారని పేర్కొన్నారు. ఆమె అభిమానులకు, కార్యకర్తలకు విజయ చిహ్నం చూపిస్తూ ఉత్సాహపరిచారు. మమతా బెనర్జీ కేంద్ర బలగాలు, పరిశీలకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఆర్పీఎఫ్ సిబ్బంది, కేంద్ర పరిశీలకులు మహిళలు సహా అందరినీ లక్ష్యంగా చేసుకుంటున్నారని, అమాయకులను కొడుతున్నారని మండిపడ్డారు. మహిళలు, పిల్లలను కూడా వదలడం లేదని ఆరోపించారు. నిన్న రాత్రి నుంచి ఘోరాలకు పాల్పడ్డారని అన్నారు. ఎంతోమంది టీఎంసీ మద్దతుదారులను అదుపులోకి తీసుకున్నారని మమతా బెనర్జీ అన్నారు.

## ఫలితాలపై తప్పుడు ప్రచారం: సీబీఎస్ఈ

న్యూఢిల్లీ: ఈ సంవత్సరం తొలిసారిగా సీబీఎస్ఈ 12వ తరగతి సమాధాన పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ మూల్యాంకన ప్రక్రియలో సాంకేతిక లోపం తలెత్తిందని, దాంతో మూల్యాంకనం ఆలస్యమయ్యే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. సాంకేతిక లోపం తలెత్తడంతో మూల్యాంకన ప్రక్రియ ఆలస్యమయ్యే అవకాశం ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని బోర్డు ఖండించింది. తాము ప్రవేశపెట్టిన ఆన్ స్క్రీన్ మార్కింగ్ విధానంలో మూల్యాంకన ప్రక్రియ సజావుగా జరుగుతోందని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. ఈ అంశంపై సీబీఎస్ఈ పరీక్షల కంట్రోలర్ సన్యం భరద్వాజ్ పీటీఐతో మాట్లాడారు. మే మూడో వారం నాటికి ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలిపారు. కొత్తగా ప్రవేశపెట్టిన విధానంలో సాంకేతిక లోపాలను ఎత్తిచూపుతూ వచ్చిన మీడియా కథనం వాస్తవదూరంగా ఉందన్నారు. ఎవాల్యుయేషన్ ప్రక్రియ గతంలో కన్నా అద్భుతంగా జరుగుతోందని తెలిపారు. ఈ విధానంపై టీచర్లు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, తమకు సెల్ఫీలు, ఫొటోగ్రాఫ్‌లు, మెసేజ్‌లు పంపుతూ కృతజ్ఞతలు చెబుతున్నట్లు పేర్కొన్నారు. ఎవాల్యుయేషన్ షెడ్యూల్ ప్రకారమే జరుగుతోందని, ఫలితాలను మే మూడో వారం నాటికి విడుదల చేసే అవకాశం ఉందని తెలిపారు. కాగా ఈ విద్యా సంవత్సరం నుంచి బోర్డు కీలక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. 12వ తరగతి సమాధాన పత్రాలను సంప్రదాయ పద్ధతిలో కాకుండా.. తొలిసారిగా 'ఆన్-స్క్రీన్ మార్కింగ్' విధానంలో డిజిటల్‌గా మూల్యాంకనం చేస్తున్నారు.

## ఢిల్లీ హైకోర్టులో అశ్లీల వీడియోలు

న్యూఢిల్లీ: ఢిల్లీ హైకోర్టులో ఓ కేసు విచారణ జరుగుతున్న సమయంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. ఓ కేసు వర్చువల్ విచారణ జరుగుతుండగా ఒక్కసారిగా అశ్లీల వీడియోలు ప్లే అయ్యాయి. దీనితో వర్చువల్ విచారణను రెండుసార్లు నిలిపివేయాల్సి వచ్చింది. అయితే, గుర్తు తెలియని వ్యక్తి ఈ విచారణలోకి వచ్చి వీటిని ప్లే చేసినట్లు వెల్లడైంది. ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ కోర్టులో బెంచ్ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఓ కేసును విచారిస్తుండగా, మధ్యలో అశ్లీల వీడియోలు కనిపించాయి. ఆందోళనకు గురైన అధికారులు విచారణను వెంటనే నిలిపివేశారు. తిరిగి విచారణ చేపట్టినప్పటికీ మరో రెండుసార్లు అలాగే అశ్లీల వీడియోలు కనిపించాయి. ఆ తర్వాత "మీరు హ్యాక్ అయ్యారు" అనే సందేశం కనిపించింది. దీంతో వర్చువల్ విచారణను పూర్తిగా నిలిపివేశారు. ఢిల్లీ హైకోర్టు వీడియో కాన్ఫరెన్సింగ్ ఇంటర్‌ఫేస్‌ను లక్ష్యంగా చేసుకుని సైబర్ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి వర్చువల్ విచారణలోకి లాగ్-ఇన్ అయి వీడియోలను ప్లే చేసినట్లు గుర్తించారు. శ్రీధర్ సర్నోబత్, షిత్‌జీత్ సింగ్ అనే పేర్లతో లాగ్-ఇన్‌లో ఉన్న రెండు ఖాతాల నుంచి అశ్లీల కంటెంట్ ప్లే అయినట్లు గుర్తించారు. ఈ ఘటనపై దర్యాప్తు జరుగుతోంది.

## లాభాల కోసమే ఓపెన్‌ఏఐ: మస్క్

న్యూయార్క్: ప్రముఖ కృత్రిమ మేధస్సు సంస్థ ఓపెన్‌ఏఐ, దాని సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌పై టెస్లా, ఎక్స్‌ఏఐ సీఈవో ఎలాన్ మస్క్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఓపెన్‌ఏఐ తన వ్యవస్థాపక లాభాపేక్ష రహిత లక్ష్యాన్ని విడిచిపెట్టి, పూర్తిగా వాణిజ్య ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు. అమెరికాలోని ఓక్‌లాండ్ ఫెడరల్ కోర్టులో జరుగుతున్న ఈ కీలక విచారణలో మస్క్ తన వాంగ్మూలాన్ని వినిపించారు. మానవాళి ప్రయోజనాల కోసం సురక్షితమైన ఏఐని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఓపెన్‌ఏఐ ప్రారంభమైందని, కానీ ఇప్పుడు అది ఇతర టెక్ దిగ్గజాలతో పోటీ పడుతూ లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తోందని మస్క్ తన వాదనలో పేర్కొన్నారు. సంస్థ ప్రారంభ దశలో తాను ఆర్థికంగా మద్దతు ఇచ్చింది, అది ఒక లాభాపేక్ష రహిత సంస్థగా, పారదర్శకంగా ఉంటుందనే నమ్మకంతోనే అని ఆయన స్పష్టం చేశారు. ఒక స్వచ్ఛంద సంస్థను 'దోచుకోవడం' సరైందేనని కోర్టు తీర్పు ఇస్తే, అది అమెరికాలోని దాతృత్వ స్ఫూర్తిని దెబ్బతీస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఏఐ భద్రతపై గూగుల్ పెద్దగా దృష్టి పెట్టడం లేదనే భావనతోనే తాను ఓపెన్‌ఏఐ ఏర్పాటులో పాలుపంచుకున్నట్లు వివరించారు. సంస్థ ప్రారంభంలో ప్రతిభావంతులను నియమించుకోవడంలో, ఇతర టెక్ భాగస్వాములతో సంబంధాలు నెలకొల్పడంలో తాను కీలక పాత్ర పోషించానని మస్క్ కోర్టుకు తెలిపారు. మరోవైపు ఓపెన్‌ఏఐ ఈ ఆరోపణలను ఖండించింది. అధునాతన ఏఐ పరిశోధనలకు అయ్యే భారీ ఖర్చులను భరించడానికే పరిమిత-లాభాల నమూనాకు మారాల్సి వచ్చిందని వివరించింది. సంస్థపై తుది నియంత్రణ ఇప్పటికీ లాభాపేక్ష రహిత విభాగం చేతిలోనే ఉందని స్పష్టం చేసింది.



లయ్యూరి చిత్రం






## చెర్రీతో పన్నెండేళ్ల తర్వాత..!

పన్నెండేళ్ల క్రితం చరణ్‌తో కలిసి ఎవడు మూవీలో నటించిన శ్రుతిహాసన్ ఆ తరువాత అతడితో మరో సినిమాలో నటించలేదు. మళ్లీ ఇన్నేళ్ల విరామం తరువాత పెద్ది కోసం కలిసి తెరపై కనిపించబోతున్నారు. అయితే ఎవడులో చరణ్‌కు జోడీగా నటించిన శ్రుతి.. పెద్ది కోసం మాత్రం స్పెషల్ సాంగ్‌లో కనిపించి కనువిందు చేయబోతోంది. అయితే ఈ పాట కోసం భారీగానే పారితోషికాన్ని డిమాండ్ చేసిందని వార్తలు వినిపిస్తున్నాయి. ఒక్కో సినిమాకు సాధారణంగా రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల మధ్య తీసుకునే శ్రుతి పెద్ది స్పెషల్ సాంగ్ కోసం ఏకంగా రూ.3 కోట్లు తీసుకుంటోందని ఇన్ సైడ్ టాక్. ప్రభాస్ నటించిన సలార్ తరువాత ఆ స్థాయి క్రేజీ ప్రాజెక్ట్‌ని దక్కించుకోలేక పోయింది శృతిహాసన్. సూపర్ స్టార్ రజనీకాంత్ కూలీలో ప్రీతిగా కీలక పాత్రలో నటించినా శృతికి దక్కాల్సిన క్రేజ్ దక్కలేదు. కెరీర్ పరంగా కొంత డౌన్ ఫాల్ అవుతూ వస్తున్న శృతిహాసన్ తమిళంలో ట్రైన్, తెలుగులో ఆకాశంలో సగం వంటి సినిమాల్లో నటిస్తోంది. ఇందులో దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని రూపొందిస్తున్న ఆకాశంలో సగం మూవీలో శ్రుతి మోయిన్ లీడ్ హీరోయిన్ కాదు. సెకండ్ హీరోయిన్. ఫైనల్‌గా పెద్దిలో స్పెషల్ సాంగ్ కోసం టీమ్ క్రేజీ హీరోయిన్ శ్రుతిహాసన్‌ను ఫైనల్ చేసుకుంది. దీనికి సంబంధించిన షూటింగ్‌ని హైదరాబాద్ శివార్లలో ప్రత్యేకంగా వేసిన భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు.




## నేడే థియేటర్లలోకి కర

కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటించిన కొత్త సినిమా కర గురువారం ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళంతో పాటు తెలుగులోనూ ఈ చిత్రం ఏకకాలంలో విడుదల కాబోతోంది. విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించిన ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. 1991 గల్ఫ్ యుద్ధం నాటి పరిస్థితులు, దేశంలో ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ సినిమాను పీరియడ్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కించారు. ఇప్పటికే సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రానికి యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేశారు. సినిమా నిడివి 2 గంటల 41 నిమిషాలుగా ఖరారైంది. తెలుగులో ఈ సినిమాను విఘ్నేశ్వర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ పతాకాలపై సీహెచ్ సతీష్ కుమార్, రాజేష్ కుమార్ బొబ్బర విడుదల చేస్తున్నారు.




## అలేల్లే.. అలేల్లే.. శ్రీనివాస మంగాపురం

సూపర్‌స్టార్ మహేష్ బాబు సోదరుడు రమేష్ బాబు తనయుడు జయకృష్ణ, బాలీవుడ్ క్రేజీ లేడీ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరో, హీరోయిన్‌లుగా పరిచయం అవుతున్న మూవీ శ్రీనివాస మంగాపురం. ఆర్‌ఎక్స్ 100 వంటి కల్ట్ లవ్ స్టోరీ తరువాత అజయ్ భూపతి అత్యంత భారీ స్థాయిలో తెరకెక్కిస్తున్న మూవీ ఇది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఇందులో పవర్‌ఫుల్‌గా సాగే కీలక పాత్రలో నటిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా టైటిల్ దగ్గరి నుంచే అందరిలో ఆసక్తిని రేకెత్తించడం మొదలు పెట్టింది. రీసెంట్‌గా ఈ మూవీ టీజర్‌ని విడుదల చేసి ఆ క్రేజ్‌ని టీమ్ మరింతగా పెంచడంతో సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. అందుకు తగ్గట్టుగానే టీజర్‌లో జయకృష్ణ, రషా తడానీల కెమిస్ట్రీ ఉండటంతో యూత్‌ని ఈ మూవీ ఎట్రాక్ట్ చేయడం ఖాయమనే టాక్ మొదలైంది. జయకృష్ణ, రషా తడానీ ఈ ఇద్దరూ స్టార్ కిడ్స్ కావడం, ఒకేసారి వీరిద్దరూ ఒకే సినిమాతో అరంగేట్రం చేస్తుండటంతో అంచనాలు పెరిగాయి. ఇప్పటికే టీజర్, ఇందులో నటిస్తున్నకొత్త జంట నెట్టింట వైరల్ అవుతుండటంతో శ్రీనివాస మంగాపురం తెలుగు రాష్ట్రాల్లో హాట్ టాపిక్‌గా మారింది. బుధవారం ఫస్ట్ సింగిల్‌గా అలేల్లే అలేల్లే.. అంటూ సాగే హంటింగ్ మెలోడీని రిలీజ్ చేసి సంగీత ప్రియుల్ని ఆకట్టుకుంటోంది.

## ప్రకృతి ప్రేమికురాలిగా కాజల్

తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఎండలు మండిపోతున్నాయి. గ్లోబల్ వార్మింగ్ ఎఫెక్ట్ స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో చందమామ కాజల్ అగర్వాల్ ప్రయోగం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అసలింతకీ కాజల్ ఎలాంటి ప్రయోగం చేస్తోంది? అంటే.... ఈరోజు మండే ఎండలతో పాటు, పర్యావరణ కాలుష్యానికి కారణమయ్యే ఫ్యాక్టర్స్ .. పంటలపై ఉపయోగించే రసాయనాల తో ముప్పు గురించిన ఆసక్తికర కథతో సినిమా చేస్తోంది...ఈ సినిమా కథాంశం కేవలం పర్యావరణ కాలుష్యం గురించే కాదు.. ప్రధానంగా వ్యవసాయ రంగంలో రసాయనాల దుర్వినియోగం – పురుగుమందుల వాడకం వల్ల తలెత్తుతున్న భయంకరమైన పరిణామాల చుట్టూ తిరుగుతుంది. కేవలం ఒక కుటుంబం ఎదుర్కొనే సమస్యగానే కాకుండా, ప్రజారోగ్యం–భద్రతను ప్రమాదంలో పడేస్తున్న జాతీయ స్థాయి సంక్షోభాన్ని ఈ కథలో చర్చించనున్నారు. పురుగుమందుల కుంభకోణాలు వ్యవస్థలోని వైఫల్యాలను ఎండగడుతూ.. కఠినమైన నియంత్రణల అవసరాన్ని ఈ చిత్రం గుర్తు చేయనుంది. మనం గమనించకుండా వదిలేస్తున్న ఈ వాస్తవికత ఎందరో ప్రాణాలను బలితీసుకుంటోంది. ఇదొక పర్యావరణ సమస్య మాత్రమే కాదు.. మానవ సంక్షోభం కూడా.. అని నిర్మాత సాగర్ బి షిండే చిత్ర నేపథ్యాన్ని వివరించారు. కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పాడే తమ నటనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని తెలుస్తోంది. గ్లోబల్ వార్మింగ్ ముప్పును ఎదుర్కొంటున్న ఈ సమయంలో నిజంగా కాజల్ టైమింగ్ బావుంది.. సరైన సమయంలో కాజల్ అగర్వాల్ ఆసక్తికర సబ్జెక్ట్ తో ముందుకు వస్తోంది..కాజల్– శ్రేయస్ తల్పాడే కీలక పాత్రలలో నటిస్తున్న ఈ ప్రయోగాత్మక చిత్రానికి ది ఇండియా స్టోరీ అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించే ఒక సామాజిక అంశం నేపథ్యంలో సాగే ఈ సోషియో–నేషనల్ డ్రామాను జూలై 24న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.



## ప్రాణాలతో రష్మిక చెలగాటం

సౌత్ స్టార్ హీరోయిన్ రష్మిక మందన టైటిల్ రోల్ లో నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మైసా'. పవర్ ఫుల్ ఫీమేల్ సెంట్రిక్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ గా, పాన్ ఇండియా స్థాయిలో రూపుదిద్దుకుంటోంది. సినిమా కోసం ఎంత రిస్క్ అయినా చేయడానికి రెడీగా ఉండే రష్మిక.. ఇప్పుడు ఈ చిత్రం కోసం మునుపెన్నడూ లేని విధంగా తీవ్రంగా కష్టపడుతున్నారు. ఇందులో యాక్షన్ సన్నివేశాలు చేయడం కోసం కఠినమైన శిక్షణ తీసుకున్నారు. జిమ్ లో రోజూ హార్డ్ వర్కౌట్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఇప్పుడు ఓ రిస్కీ స్టంట్ చేసినట్లు తెలుస్తోంది. 'మైసా' సినిమాతో రవీంద్ర పుల్లె అనే కొత్త డైరెక్టర్ టాలీవుడ్ కి పరిచయం కాబోతున్నాడు. వాస్తవ సంఘటనల ఆధారంగా గోండ్ తెగల బ్యాక్ డ్రాప్ లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. దీంట్లో రష్మిక ఒక గోండు మహిళగా కనిపించనున్నారు. ఆల్రెడీ రిలీజైన ఫస్ట్ లుక్ పోస్టర్, గ్లింప్స్ లో రష్మిక ఇంతకుముందు ఎప్పుడూ చూడని ఇంటెన్స్ అవతార్ లో కనిపించి అందరికీ షాక్ ఇచ్చారు. అయితే ఈ సినిమా కోసం రష్మిక డెడికేషన్ గురించి డైరెక్టర్ రవీంద్ర పుల్లె తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు.



## టాక్సిక్ మళ్లీ వాయిదా

గత కొన్నిరోజుల నుంచి సోషల్ మీడియాలో రూమర్స్ వస్తున్నట్లే యష్ 'టాక్సిక్' మరోసారి వాయిదా పడింది. ఈ విషయాన్ని ఇప్పుడు అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమాని జూన్ 4న విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ, అది కుదరడం లేదు. మూవీ అయితే సిద్ధంగా ఉందని కానీ అంతర్జాతీయ డిస్ట్రిబ్యూషన్, భాగస్వామ్యాలు జరుగుతున్న కారణంగా విడుదల తేదీని మారుస్తున్నాం. ప్రపంచవ్యాప్తగా ఒకే తేదీకి రిలీజ్ చేసేలా కొత్త డేట్ త్వరలోనే ప్రకటిస్తాం. ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల్ని ఆకట్టుకునే సామర్థ్యం ఉంది. ఆడియెన్స్ అంచనాలు అందుకునేలా కాస్త టైమ్ తీసకుని, అత్యుత్తమ ఔట్‌పుట్ అందించాలనుకుంటున్నామని హీరో, నిర్మాత యష్ ఓ నోట్ రిలీజ్ చేశాడు. మాఫియా బ్యాక్ డ్రాప్ స్టోరీతో తీసిన ఈ సినిమాలో యష్ హీరో కాగా రుక్మిణి వసంత్, నయనతార, కియారా అద్వాణీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా హీరోయిన్లుగా నటించారు. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ దీన్ని తెరకెక్కించింది. 'జన నాయగణ్' నిర్మించిన కేవీఎన్ ప్రొడక్షన్.. ఈ చిత్రాన్ని కూడా యష్‌తో కలిసి నిర్మించింది. తొలుత మార్చి 19 అనుకున్నారు కుదర్లేదు. జూన్ 4 అనుకున్నారు కుదర్లేదు. మరి ఈసారైనా ఓ తేదీ ఫిక్స్ చేసుకుని రిలీజ్ చేస్తారా అనేది చూడాలి?



## భారత స్టార్ గోల్ఫర్ విజయ్ కన్నుమూత

భారత గోల్ఫ్ రంగం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వెటరన్ గోల్ఫ్ క్రీడాకారుడు విజయ్ కుమార్ కన్నుమూశారు. 60 ఏళ్ల వయసు ఉన్న ఆయన బుధవారం లక్నోలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. దేశీయ గోల్ఫ్ సర్క్యూట్‌లో అత్యంత విజయవంతమైన క్రీడాకారుల్లో ఒకరిగా పేరుగాంచిన విజయ్ కుమార్ మరణం పట్ల క్రీడాలోకం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోంది. ఇవాళ ఉదయం విజయ్ కుమార్‌కు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. దీంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను లక్నోలోని ఓ స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కానీ, అప్పటికే ఆయన మరణించినట్లుగా వైద్యులు ధృవీకరించారు. లక్నో గోల్ఫ్ క్లబ్‌తో దశాబ్దాల అనుబంధం ఉన్న విజయ్ కుమార్ తన మొత్తం కెరీర్‌లో ఎన్నో అద్భుతమైన విజయాలు సొంతం చేసుకున్నారు. 2002లో జరిగిన ప్రతిష్టాత్మక 'ఇండియన్ ఓపెన్' టైటిల్‌ను గెలుచుకుని భారత గోల్ఫ్ చరిత్రలో నిలిచిపోయారు. ఇండియన్ టూర్లో దాదాపు 50కి పైగా టైటిళ్లను గెలుచుకున్న ఘనత ఆయనదే. 1990వ దశకం చివరలో, 2000 ప్రారంభంలో భారత దేశవాళీ గోల్ఫ్ ర్యాంకింగ్స్‌లో చాలాకాలం పాటు ఫస్ట్ ర్యాంక్‌లో కొనసాగారు. గోల్ఫ్ రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. అయితే, విజయ్ కుమార్ మరణం పట్ల తోటి గోల్ఫ్ క్రీడాకారులు జీవ్ మిల్కా సింగ్, శివ్ కపూర్, అర్జున్ అత్వాల్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

## రియాన్ పరాగ్‌పై కేసు?



రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ చిక్కుల్లో పడ్డాడు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా డ్రెస్సింగ్ రూమ్‌లో పరాగ్ 'వేపింగ్' (ఇ-సిగరెట్ తాగడం) చేస్తున్న దృశ్యాలు ప్రత్యక్ష ప్రసారంలో కెమెరాకు చిక్కాయి. రాజస్థాన్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో 16వ ఓవర్ వద్ద చోటు చేసుకున్న ఈ ఘటన సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో పాటు క్రీడా వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సాధారణంగా స్టేడియం ప్రాంగణం, డ్రెస్సింగ్ రూమ్‌లో ధూమపానం చేయడం ఐసీసీ, బీసీసీఐ నిబంధనల ప్రకారం పూర్తిగా నిషేధం. ఈ ఘటనపై బీసీసీఐ క్రమశిక్షణ కమిటీ విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇదిలా భారత్‌లో 2019 నుండి ఇ-సిగరెట్ల విక్రయం, వాడకంపై చట్టపరంగా నిషేధం ఉన్న నేపథ్యంలో, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పరాగ్‌పై భారీ జరిమానాతో పాటు మ్యాచ్ సస్పెన్షన్ విధించే ప్రమాదం ఉంది. అలాగే నిబంధనల ప్రకారం అతని పై క్రిమినల్ కేసు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఒక బాధ్యతాయుతమైన కెప్టెన్ హోదాలో ఉండి ఇలాంటి చర్యలకు పాల్పడటంపై నెటిజన్లు, మాజీ క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదంపై రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం లేదా బోర్డు నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.



## వైభవ్ బ్యాటింగ్ సినిమా చూస్తున్నట్లే ఉంది: పుజారా

రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఆటతీరుపై భారత మాజీ ఆటగాడు ఛతేశ్వర్ పుజారా ప్రశంసల వర్షం కురిపించాడు. అతడి బ్యాటింగ్ చూస్తుంటే ఒక సినిమా చూసిన అనుభూతి కలుగుతుందని పుజారా అభివర్ణించాడు. పంజాబ్ కింగ్స్‌తో గతరాత్రి జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో రాజస్థాన్ 6 వికెట్ల తేడాతో గెలిచిన నేపథ్యంలో పుజారా ఈ వ్యాఖ్యలు చేశాడు. ఈ మ్యాచ్‌లో 223 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో సూర్యవంశీ కేవలం 16 బంతుల్లో 43 పరుగులు చేసి రాజస్థాన్‌కు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ పుజారా దీనిపై స్పందించాడు. "వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ చేయడం ఒక సినిమాటిక్ అనుభవం. అతడు ఏ బౌలర్‌కైనా భయం లేకుండా ఎదురెళ్లే తీరు అద్భుతం. బంతిని చూసి, దానిని బాదడమే అతడికి తెలుసు. పవర్‌ప్లేలో అతడి దూకుడైన ఆటతీరే జట్టుకు తిరుగులేని ఆధిక్యాన్ని ఇస్తోంది" అని పుజారా వివరించాడు. ఇదే సమయంలో, మధ్య ఓవర్లలో రాణించిన స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్‌ను కూడా పుజారా మెచ్చుకున్నాడు. "పరుగులు ఇచ్చినా చాహల్ ధైర్యంగా బంతులు వేసి వికెట్లు తీయడానికి ప్రయత్నించాడు. అతడి వైవిధ్యమైన బౌలింగ్ అద్భుతం. స్పీడ్‌లో మార్పులు చేస్తూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టాడు," అని తెలిపారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ మరో నాలుగు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేదించి పంజాబ్‌కు సీజన్‌లో తొలి ఓటమిని రుచి చూపించింది.





# సన్ రైజర్స్.. ధనాధన్

### ముంబైపై సంచలన చేజింగ్ .. 6 వికెట్ల తేడాతో విజయం

**ఐపీఎల్‌లో మరోసారి పరుగుల సునామీ సృష్టించిన సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబై ఇండియన్స్‌పై చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ముంబై నిర్దేశించిన 244 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.**

**ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసానికి, హెన్రిచ్ క్లాసెన్, సలీల్ అరోరా మెరుపులు తోడవడంతో సన్‌రైజర్స్ 8 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది. ముంబై బ్యాటర్ రియాన్ రికెల్టన్ అద్భుత శతకం వృథా అయింది.**

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| పంజాబ్ | 8 | 6 | 1 | 13 |
| బెంగళూరు | 8 | 6 | 2 | 12 |
| హైదరాబాద్ | 9 | 6 | 3 | 12 |
| రాజస్థాన్ | 9 | 6 | 3 | 12 |
| గుజరాత్ | 8 | 4 | 4 | 8 |
| చెన్నై | 8 | 3 | 5 | 6 |
| ఢిల్లీ | 8 | 3 | 5 | 6 |
| కోల్‌కతా | 8 | 2 | 5 | 5 |
| ముంబై | 8 | 2 | 6 | 4 |
| లక్నో | 8 | 2 | 6 | 4 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

244 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన సన్‌రైజర్స్‌కు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ తిరుగులేని ఆరంభాన్ని అందించారు. తొలి బంతి నుంచే ముంబై బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఈ జోడీ, పవర్‌ప్లేలోనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించింది. వీరిద్దరూ కలిసి కేవలం 8.4 ఓవర్లలోనే 129 పరుగుల విధ్వంసకర భాగస్వామ్యం నెలకొల్పి గెలుపునకు బలమైన పునాది వేశారు. ట్రావిస్ హెడ్ కేవలం 30 బంతుల్లో 5 ఫోర్లు, 8 సిక్సర్లతో 76 పరుగులు చేయగా, అభిషేక్ శర్మ 24 బంతుల్లో 3 సిక్సర్లు, 5 ఫోర్లతో 45 పరుగులు సాధించి అతనికి అండగా నిలిచాడు. అయితే, 129 పరుగుల వద్ద అభిషేక్ శర్మ ఔటైన తర్వాత, సన్‌రైజర్స్ స్వల్ప వ్యవధిలో ఇషాన్ కిషన్ (0), ట్రావిస్ హెడ్ వికెట్లను కోల్పోయి కాస్త తడబడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ (30 బంతుల్లో 65 నాటౌట్), నితీశ్ కుమార్ రెడ్డి (17 బంతుల్లో 21)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. క్లాసెన్ తనదైన శైలిలో బౌండరీలు బాదుతూ స్కోరు వేగాన్ని తగ్గకుండా చూసుకున్నాడు. నితీశ్ ఔటయ్యాక, కీలక సమయంలో క్రీజులోకి వచ్చిన యువ బ్యాటర్ సలీల్ అరోరా తన సత్తా చాటాడు. కేవలం 10 బంతుల్లో 1 ఫోర్, 3 భారీ సిక్సర్లతో 30 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ముఖ్యంగా అతను బాదిన సిక్సర్లు మ్యాచ్‌ను ఎస్ఆర్‌హెచ్ వైపు పూర్తిగా తిప్పేశాయి. హార్దిక్ పాండ్యా విసిరిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో సలీల్ అరోరా ఒక ఫోర్, రెండు సిక్సర్లు బాదడంతో సన్ రైజర్స్ విజయతీరాలకు చేరింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ రియాన్ రికెల్టన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 55 బంతుల్లో 11 ఫోర్లు, 8 సిక్సర్లతో అజేయంగా 123 పరుగులు చేసి ముంబైకి భారీ స్కోరు అందించాడు. అతనికి తోడుగా విల్ జాక్స్ (22 బంతుల్లో 46), హార్దిక్ పాండ్యా (15 బంతుల్లో 31) రాణించారు. అయితే, బౌలర్లు పూర్తిగా విఫలమవడంతో ముంబైకి ఓటమి తప్పలేదు.



## అంతర్జాతీయ మ్యాచ్‌లలో అఫ్గాన్ మహిళలు

అఫ్గానిస్తాన్ ఫుట్‌బాల్ క్రీడాకారిణులు ఇకపై అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో పాల్గొనబోతున్నారు. ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు ఆడేందుకు అఫ్గాన్ నుంచి వచ్చిన శరణార్థి మహిళా ప్లేయర్లతో ఏర్పడిన అఫ్గాన్ ఉమెన్ యునైటెడ్(ఏఎఫ్‌సీ)కి ఫిఫా కౌన్సిల్ బుధవారం అనుమతి ఇచ్చింది. అఫ్గానిస్తాన్‌లో తాలిబన్‌లు అధికారంలోకి వచ్చిన తర్వాత క్రీడల్లో మహిళలపై నిషేధం విధించిన విషయం తెలిసిందే. దీంతో చాలా మంది ఫుట్‌బాల్ క్రీడాకారిణులు అఫ్గాన్‌ను విడిచి ఆస్ట్రేలియాకు వచ్చారు. అయితే, తాలిబన్ ప్రభుత్వం అనుమతి లేకపోయినా అంతర్జాతీయ టోర్నీల్లో అఫ్గాన్ జాతీయ జట్టుగా ఏఎఫ్‌సీ పాల్గొనడానికి ఫిఫా కౌన్సిల్ అనుమతి ఇచ్చింది. ఇది చారిత్రాత్మక పాలనా నిర్ణయమని ఫిఫా ప్రెసిడెంట్ గియానీ ఇన్ఫాంటినో తెలిపారు. 'ప్రపంచ క్రీడలో ఇది శక్తివంతమైన, అపూర్వమైన ముందడుగు. ఫుట్‌బాల్ ఆడేందుకు, తమ అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు ప్రతి బాలికకు, మహిళాకు ఉన్న హక్కును పరిరక్షించడం ఫిఫా బాధ్యత. అందుకే అధికారిక మ్యాచ్‌ల్లో అఫ్గాన్ మహిళలు తమ దేశం తరపున పాల్గొనడానికి అనుమతి ఇచ్చాం.'అని తెలిపారు. జూన్‌లో న్యూజిలాండ్‌లో అఫ్గాన్ జట్టు ట్రైనింగ్ క్యాంప్‌కు ఫిఫా నిధులు సమకూర్చనుంది.

## యువీ నన్ను ఉన్నతంగా మార్చారు: అభిషేక్ శర్మ



ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) తరఫున ఓపెనర్‌గా పరుగుల వరద పారిస్తున్న యువ ఆటగాడు అభిషేక్ శర్మ, తన అద్భుతమైన ఫామ్ వెనుక భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కీలక పాత్ర పోషించాడని వెల్లడించాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 8 మ్యాచ్‌లలో ఒక సెంచరీ, మూడు అర్ధ సెంచరీలతో 380 పరుగులు చేసిన అభిషేక్, తన చిన్ననాటి హీరో అయిన యువరాజ్ మార్గదర్శనం తన ఆటతీరును, ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసిందని పేర్కొన్నాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ... "చిన్నప్పటి నుంచి యువీ పాజీ అంటే నాకు ఎంతో అభిమానం. ఆయనే నా ఆరాధ్య దైవం. లాక్‌డౌన్ సమయంలో ఆయన వద్ద శిక్షణ తీసుకోవడం నా కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ శిక్షణ శిబిరంలో ఆయన నాతో అన్న మాటలు నాలో అపారమైన విశ్వాసాన్ని నింపాయి. 'మనం కేవలం దేశవాళీ క్రికెట్ లేదా ఐపీఎల్ కోసం సిద్ధం కావడం లేదు. భారత్ తరఫున కీలక మ్యాచ్‌లు గెలిపించేలా, ఒత్తిడిలో రాణించేలా నిన్ను మానసికంగా సిద్ధం చేస్తున్నా' అని యువరాజ్ చెప్పారు. ఆ మాటలు నా లక్ష్యాన్ని ఉన్నతంగా మార్చాయి" అని అభిషేక్ గుర్తుచేసుకున్నాడు. ప్రస్తుత సీజన్‌లో తన దూకుడైన బ్యాటింగ్‌కు సహచర ఓపెనర్ ట్రావిస్ హెడ్ కూడా ఒక కారణమని అభిషేక్ తెలిపాడు. "హెడ్ ఎస్ఆర్‌హెచ్ జట్టులోకి రాకముందు నుంచే నేను అతని ఆటను గమనిస్తున్నా. అతని బ్యాటింగ్ మైండ్‌సెట్ గురించి అడిగాను.

ఈవార్తలు
# ప్రజావాణి

www.evarthalu.com

నేటి ఈవార్తలు

గురువారం 30-4-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు **సంపాదకీయం** Editorial

# వ్యవస్థల పతనం.. ప్రజాస్వామ్యానికి చేటు

ప్రజాస్వామ్య సౌధానికి న్యాయవ్యవస్థ, కార్య నిర్వాహక వ్యవస్థ బలమైన స్తంభాలు. ఈ వ్యవస్థలు నిష్పక్షపాతంగా, పారదర్శకమైన రీతిలో పని చేసినప్పుడే సామాన్యుడికి రాజ్యాంగం పట్ల నమ్మకం కలుగుతుంది. కానీ దురదృష్టవశాత్తూ, ప్రస్తుత రాజకీయ ముఖచిత్రంలో 'వ్యక్తిగత కలయికలు' వ్యవస్థల నిర్ణయాలను ప్రభావితం చేస్తున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు రాజకీయాలకు అతీతంగా ఉండాల్సింది పోయి, అధికార పక్షాలతో చేతులు కలపడం అత్యంత హేయమైన చర్య. న్యాయమూర్తులు రాజకీయ నాయకులతో బహిరంగంగా భేటీ కావడం, ఆ వెంటనే సంచలన తీర్పులు రావడం యాదృచ్ఛికమే కావచ్చు, కానీ అది ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. 'న్యాయం జరగడమే కాదు, జరుగుతున్నట్లు కనిపించాలి' అనేది న్యాయ శాస్త్ర ప్రాథమిక సూత్రం. రాజకీయ ప్రయోజనాల కోసం న్యాయవ్యవస్థను వాడుకోవడం వల్ల సామాన్యుడికి ఆఖరి ఆశగా ఉన్న కోర్టులపై గౌరవం తగ్గిపోతుంది. తీర్పులు చట్టబద్ధంగా కాకుండా, పరిచయాల ప్రాతిపదికన వెలువడుతున్నాయన్న భావన ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదకరం. గవర్నర్ పదవి ఒక అలంకారప్రాయమైన, రాజ్యాంగబద్ధమైన బాధ్యత. కానీ, నేడు గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాలతో ఘర్షణ పడటం లేదా రాజకీయ నాయకులను నేరుగా కలిసి 'మేలు' చేయడం నిత్యకృత్యమైంది. ప్రభుత్వ పనులు సాఫీగా జరగాలంటే గవర్నర్లతో రహస్య మంతనాలు జరపాల్సి రావడం పాలనలో పారదర్శకత లేకపోవడాన్ని సూచిస్తోంది. గవర్నర్ కార్యాలయం రాజకీయ ప్రచారానికి వేదికగా మారడం వల్ల సమాఖ్య స్ఫూర్తి దెబ్బతింటోంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే, వ్యవస్థలు తమ స్వతంత్రతను కోల్పోయి రాజకీయ పార్టీల చేతిలో కీలుబొమ్మలుగా మారుతాయి. రాజ్యాంగ పరిరక్షకులుగా ఉండాల్సిన వారే రాజీపడితే, సామాన్యుడి గొంతు ఎక్కడ వినిపిస్తుంది? రాజకీయ నాయకుల ప్రలోభాలకు లోబడకుండా, తమ పదవుల గౌరవాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయమూర్తులు, గవర్నర్లపై ఉంది. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఓట్లు, ఎన్నికలు మాత్రమే కాదు.. అది వ్యవస్థల పట్ల విశ్వసనీయత. ఆ విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. వ్యవస్థలు శుద్ధి కాకపోతే, భావి తరాలు రాజ్యాంగంపై నమ్మకాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది.

# నవ భారత ప్రజాస్వామ్య జాతర

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలు అంటే కేవలం ఒక ప్రక్రియ మాత్రమే కాదు, అది ఒక పండుగ. ఇటీవల కాలంలో జరుగుతున్న ఎన్నికల్లో పోలింగ్ శాతం మునుపెన్నడూ లేని విధంగా పెరుగుతుండటం శుభపరిణామం. ఇది దేశ భవిష్యత్తును నిర్ణయించే ఓటరు నాడిలో వచ్చిన గుణాత్మక మార్పుకు నిదర్శనం. ఒకప్పుడు 'ఓటు వేస్తే ఏమొస్తుంది?' అనే ఉదాసీనత పట్టణ, విద్యావంతులైన ఓటర్లలో కనిపించేది. కానీ నేడు పరిస్థితి తారుమారైంది. సామాన్యుడి నుంచి సెలబ్రిటీ వరకు ప్రతి ఒక్కరూ పోలింగ్ కేంద్రం వద్ద క్యూ కడుతున్నారు.





ఈ సానుకూల పవనాలకు ప్రధాన కారణం ప్రజల్లో పెరిగిన రాజకీయ అవగాహన. తమ ఓటు కేవలం ఒక ప్రతినిధిని ఎన్నుకోవడం మాత్రమే కాదు, తమ జీవన ప్రమాణాలను, దేశ ప్రగతిని నిర్దేశించే అస్త్రమని ప్రజలు గుర్తించారు. ఇటీవలి ఎన్నికల సరళిని గమనిస్తే పురుషుల కంటే మహిళలే అధిక శాతంలో ఓటింగ్ వేయడం గమనార్హం. సంక్షేమ పథకాల ప్రభావం, సామాజిక భద్రతపై అవగాహన మహిళలను పోలింగ్ కేంద్రాల వైపు నడిపిస్తున్నాయి. మరోవైపు, తొలిసారి ఓటు వేసే యువత ఉత్సాహం దేశానికి కొత్త ఊపిరి పోస్తోంది. సోషల్ మీడియా విప్లవం వల్ల యువత రాజకీయ పరిణామాలను నిశితంగా గమనిస్తూ, తమ గళాన్ని ఓటు రూపంలో వినిపిస్తున్నారు. పోలింగ్ శాతం పెరగడంలో భారత ఎన్నికల సంఘం కృషి అనన్యం. "నన్ లెఫ్ట్ బిహైండ్" (ఎవరినీ వదిలిపెట్టకూడదు) అనే నినాదంతో మారుమూల గ్రామాలు, కొండ ప్రాంతాలకు సైతం ఎన్నికల యంత్రాంగం చేరుకుంది. 'స్వీప్' వంటి కార్యక్రమాల ద్వారా ఓటు ప్రాధాన్యతను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లారు. వృద్ధులు, దివ్యాంగుల కోసం 'హోమ్ ఓటింగ్' సదుపాయం కల్పించడం విప్లవాత్మక మార్పు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వీవీప్యాట్‌ల వాడకం వల్ల ఓటింగ్ ప్రక్రియ వేగవంతం కావడమే కాకుండా, పారదర్శకతపై ప్రజల్లో నమ్మకం పెరిగింది. వేలిపై సిరా చుక్కను సోషల్ మీడియాలో 'సెల్ఫీ'గా పోస్ట్ చేయడం నేడు ఒక గర్వకారణంగా మారింది. ఈ సంస్కృతి పట్టణ ఓటర్లను కూడా ఓటు వేయడానికి ప్రేరేపిస్తోంది. ఎక్కువ మంది ఓటు వేయడమంటే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావడమే. ప్రజలు తమ బాధ్యతను గుర్తించి ఓటు వేయడం వల్ల పాలకులు కూడా జవాబుదారీతనంతో వ్యవహరించాల్సి ఉంటుంది. ఓటింగ్ శాతంలో వస్తున్న ఈ వృద్ధి రేటు, రేపటి మేలైన భారతదేశానికి పునాది. కేవలం ఓటు వేయడమే కాకుండా, సరైన అభ్యర్థిని ఎంచుకునే విజ్ఞత కూడా తోడైతే మన ప్రజాస్వామ్యం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుంది.



వినోద్ కుమార్





# ఏమిటో ఈ విద్యుత్తు కోతలు?



వెంకటేశ్ గుగ్గిళ్ల
ఈవార్తలు దినపత్రిక రిపోర్టర్

వేసవి భానుడు భగభగమంటుంటే, తెలంగాణ ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఒకవైపు, అప్రకటిత విద్యుత్ కోతలు మరోవైపు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. "మిగులు విద్యుత్ రాష్ట్రం" అని గొప్పలు చెప్పుకున్న గడ్డపై, నేడు గంటల తరబడి కరెంటు పోతుండటం పాలకుల ముందుచూపు లేమికి నిదర్శనం. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు కోతలు నిత్యకృత్యంగా మారడం ప్రభుత్వ పనితీరుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో విద్యుత్ రంగంలో సాధించిన ప్రగతిని చూసి అందరూ హర్షించారు. కానీ, నేడు పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోంది. వేసవిలో డిమాండ్ పెరుగుతుందని తెలిసినప్పటికీ, దానికి అనుగుణంగా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వం విఫలమైంది. గ్రిడ్ నిర్వహణలో లోపాలు, ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, పెరిగిన వినియోగానికి తగ్గట్టుగా ముందస్తు ప్రణాళికలు లేకపోవడం వల్లే ఈ అస్తవ్యస్త పరిస్థితి నెలకొంది. కేవలం సాంకేతిక కారణాలంటూ కాలయాపన చేయడం తప్ప, శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడటం లేదు. విద్యుత్ కోతల ప్రభావం కేవలం గృహ వినియోగదారులకే పరిమితం కాలేదు. వ్యవసాయంపై ఆధారపడిన రైతాంగం మోటార్లు నడవక, పంటలు ఎండిపోతుంటే కళ్లప్పగించి చూడాల్సిన దుస్థితి ఏర్పడింది. చిన్న తరహా పరిశ్రమలు మూతపడే దశకు చేరుకున్నాయి. రాత్రివేళల్లో కరెంటు కోతలతో విద్యార్థులు, వృద్ధులు నరకయాతన అనుభవిస్తున్నారు. 24 గంటల నిరంతర విద్యుత్ ఇస్తున్నామని ప్రకటనలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని గమనించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వాలు మారినా ప్రజల కష్టాలు మారడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజకీయ విమర్శలు, ప్రతి విమర్శల కంటే ప్రజలకు నిరంతర విద్యుత్తును అందించడమే తక్షణ కర్తవ్యం కావాలి. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని, యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. అదనపు విద్యుత్ కొనుగోలుతో పాటు, పంపిణీ వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది తెలంగాణను చీకట్ల నుంచి కాపాడాలి. లేదంటే ప్రజల ఆగ్రహానికి పాలకులు సమాధానం చెప్పుకోక తప్పదు. తెలంగాణలో ఒకవైపు గరిష్ట డిమాండ్ 18,139 మెగావాట్లకు చేరుతుంటే, మరోవైపు గత ఏడాదితో పోలిస్తే విద్యుత్ ఉత్పత్తిలో 4,816 మిలియన్ యూనిట్ల మేర లోటు కనిపిస్తోంది. జాతీయ సగటు కంటే 70 శాతం ఎక్కువ తలసరి వినియోగం ఉన్న రాష్ట్రంలో, పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరాను క్రమబద్ధీకరించడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

# ప్రమాదంలో సం'బంధం'



శశిధర్ అక్కెల

నమ్మకం పునాదిగా సాగాల్సిన వైవాహిక జీవితాలు నేడు రక్తసిక్తమవుతున్నాయి. క్షణికావేశాలు, అనైతిక సంబంధాలు పచ్చని సంసారాల్లో చిచ్చు పెడుతున్నాయి. నిన్నటి వరకు ప్రాణానికి ప్రాణంగా ప్రేమించుకున్న వారే.. నేడు ఒకరి ప్రాణాలు తీసే స్థాయికి దిగజారుతుండటం సభ్య సమాజం తలదించుకోవాల్సిన విషయం. వివాహేతర సంబంధాల వ్యామోహంలో పడి కన్నబిడ్డలను, కట్టుకున్న వారిని కడతేరుస్తున్న ఉదంతాలు నిత్యం వార్తల్లో కనిపిస్తూనే ఉన్నాయి. ఈ అనర్థాలకు ప్రధాన కారణం నైతిక విలువల పతనం. సాంకేతికత పెరిగి లోకం అరచేతిలోకి వచ్చాక, సోషల్ మీడియా వేదికగా ఏర్పడుతున్న పరిచయాలు అనేక కుటుంబాలను వీధిన పడేస్తున్నాయి. కేవలం చట్టాలు, శిక్షలతోనే ఈ పరిస్థితిని మార్చలేం. ప్రభుత్వాలు ఈ సమస్యను ఒక సామాజిక విపత్తుగా పరిగణించాలి. ప్రతి జిల్లా, మండల కేంద్రంలో నైపుణ్యం కలిగిన సైకాలజిస్టులతో కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి. గొడవలు పడే జంటలకు సరైన మార్గనిర్దేశం చేసే వ్యవస్థ ఉండాలి. చిన్నప్పటి నుంచే నైతిక విలువలు, జెండర్ సెన్సిటైజేషన్ (లింగ సమానత్వం), బంధాల పట్ల గౌరవం పెంచేలా పాఠ్యాంశాలను రూపొందించాలి. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగే నేరాలపై విచారణ వేగంగా జరిపి, నిందితులకు కఠిన శిక్షలు పడేలా చూడాలి. ఇది ఇతరుల్లో భయాన్ని కలిగిస్తుంది. అనేక హత్యలకు మూల కారణం వ్యసనాలు. వీటిని కఠినంగా నియంత్రించడం ద్వారా నేరాల సంఖ్యను తగ్గించవచ్చు. కేవలం ప్రభుత్వంపైనే భారం వేయకుండా, స్వచ్ఛంద సంస్థలు మరియు కుల పెద్దలు కూడా నైతిక చైతన్యం కల్పించడంలో భాగస్వాములు కావాలి. కుటుంబం అనేది సమాజానికి పునాది. ఆ పునాది కదిలిపోతే దేశ భవిష్యత్తు అంధకారమవుతుంది. ఇప్పటికైనా పాలకులు, ప్రజలు కలిసికట్టుగా ఈ సామాజిక రుగ్మతపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.



This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.